WWW.nindam.co.in

# నినాదం

తెలుగు దినపత్రిక

నిఖార్సైన జర్నలిజం

శనివారం, అక్టోబర్ 19, 2024 | సంపుటి - 21 | సంచిక 31 | వెల - 7 | పేజీలు - 12

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## దేశ ముఖచిత్రాన్ని మార్చేదే విద్య

- గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యను అందించండి
- ఒక్కో కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోండి
- పట్టణ తరహాలో పల్లెల్లో కార్పొరేట్ విద్య సర్కారు లక్ష్యం
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** దేశ ముఖ చిత్రాన్ని మార్చడం విద్యతోనే సాధ్యమని, విద్య అందరికి ముఖ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్ లో హైసా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ విద్య సదస్సుకు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ములుగు కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి ఆమె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ▸▸వివరాలు 3లో



## సుప్రీం చరిత్రలో కొత్త అధ్యాయం

- కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్‌కు యత్నం
- ప్రత్యేక యాప్ ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ,అక్టోబర్18(నినాదం):**

సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. ▸▸తరువాయి 2లో..



## యదాతథంగా గ్రూప్-1 మెయిన్స్

- సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్
- వాయిదా కోరుతూ వేసిన పిటిషన్ల డిస్మిస్
- సుప్రీంను ఆశ్రయించిన పలువురు అభ్యర్థులు

**హైదరాబాద్,అక్టోబర్18(నినాదం):** తెలంగాణ గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులకు రాష్ట్ర హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది . గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు హైకోర్టు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరీక్షలు వాయిదా వేయాలన్న గ్రూప్ – 1 అభ్యర్థుల రిట్ అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. 2లో..

## రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు

హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయాల్లో జాగ్రత్త

కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్,అక్టోబర్18(నినాదం):**



సిఎం రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు.. హైడ్రా, మూసీ, గ్రూప్–1 విషయాల్లో జాగ్రత్త పడాలి..అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను పదవి నుంచి దింపేందుకు కాంగ్రెస్‌లోని కొందరు మంత్రులు ప్రయత్నిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పీఠం నుంచి దించాలని కాంగ్రెస్ మంత్రులు చూస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. గోతికాడ నక్కలా రేవంత్‌ను దింపేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. హైడ్రా, మూసీ, గ్రూప్–1 విషయంలో జాగ్రత్త పడకపోతే.. రేవంత్ రెడ్డికు చిక్కులు తప్పవని బండి సంజయ్ అన్నారు. ▸▸తరువాయి2లో..



## స్కిల్ వర్సిటీకి అదానీ గ్రూప్ 100 కోట్ల విరాళం

చెక్కును స్వయంగా అందించిన అదానీ | హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను కలిసి అందజేత

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**హైదరాబాద్,అక్టోబర్18(నినాదం):**

యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. దీనికి మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ▸▸తరువాయి2లో..

## అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలి

- గ్రూప్ -4 ఉద్యోగ అభ్యర్థుల డిమాండ్
- గాంధీ భవన్ వద్ద ఆందోళన




**హైదరాబాద్,అక్టోబర్18(నినాదం):** గాంధీ భవన్ వద్ద గ్రూప్ –4 ఉద్యోగ అభ్యర్థులు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. కొందరు గ్రూప్ –2, గ్రూప్ –1 మెయిన్‌కు ఎంపిక అయిన వారిని గ్రూప్ 4 నుంచి వెంటనే అన్ లివింగ్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పోస్టులలో ఉన్న వారు అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. వారి పోస్టులు వచ్చి వెళ్లిన తర్వాత బ్యాక్ లాగ్‌లుగా ఉంచవద్దని.. దీని వల్ల వెనకున్న అభ్యర్థులు నష్టపోతారని వాపోయారు. రెండు వేల పోస్టులు ఖాళీ అయ్యో అవకాశం ఉందని.. వెంటనే ప్రభుత్వం స్పందించాలని గ్రూప్ –4 అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్–4 అభ్యర్థుల ఆందోళనతో గాంధీభవన్ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వారిని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

## ముందు డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

మూసీ సుందరీకరణపై కిషన్ రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్, నినాదం: డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ జరగదని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని 30 శాతం జనాభా హైదరాబాద్‌లోనే ఉందన్నారు.

02

## కుల గణనకు మద్దతు ఇవ్వండి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరిన జాజుల

హైదరాబాద్, నినాదం: కుల గణనకు మద్దతు ఇవ్వాలని కిషన్ రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు చేరుకొని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు.



## అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్

- మూసీపై రోజుకో మాటతో ప్రజల్లో గందరగోళం
- మూసీని మురికికూపంగా చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- మూసీలో వరదలు వచ్చినా..నీళ్లునిలిచే ప్రసక్తే లేదు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కెటిఆర్ 2లో..

**హైదరాబాద్,అక్టోబర్18(నినాదం):**

మూసీ సుందరీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతూ.. అపరిచితుడిలాగా మారిపోయాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మూసీ సుందరీకరణ చేస్తాం అని మొట్టమొదట చెప్పిందే రేవంత్ రెడ్డి.. కానీ నిన్న ప్రెస్ మీట్లో అసలు సుందరీకరణ మాట ఎక్కడి నుంచి వచ్చిందని అంటున్నాడని కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఒక రోజు సుందరీకరణ అంటాడు.. మరొక రోజు ప్రక్షాళన అంటాడు.. మరో రోజు పునరుజ్జీవం అంటాడు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ అనే మాట మొట్టమొదటు వాడిరది రేవంత్ రెడ్డి. గోపన్‌పల్లిలో మాట్లాడుతూ లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పారు. కానీ ఇవాళ ఆయన ఒక అపరిచితుడిలా మారారు. ఆయన నోట్లో నుంచి అబద్దాలు వస్తున్నాయి.

## ఎపిలో మాఫియా రాజ్యం నడుస్తోంది

దాచుకో..దోచుకో..తినుకో అన్నదే రూల్

- ప్రశ్నించే గొంతుకలను బెదిరిస్తున్నారు
- ఇసుక, మద్యం మాఫియాలు తయరయ్యాయి
- ఉచిత ఇసుక పేరుతో డబుల్ రేట్లు వసూళ్లు
- చంద్రబాబు సర్కార్‌లో కప్పం కట్టనిదే ఏ పనీ జరగదు
- రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని జగన్ వ్యాఖ్యలు



**అమరావతి,అక్టోబర్18(నినాదం):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఏపీలో మాఫియా రాజ్యం నడుస్తోందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. నూతనంగా ఏపీలో మద్యం, ఇసుక విధానాలు తీసుకుని వచ్చారని, వాటిలో అంతా అవినీతేనని జగన్ ఆరోపించారు. దోచుకో, పంచుకో, తినుకో అనేదే సీఎం చంద్రబాబు పాలనని మండిపడ్డారు. ఈ సందర్భంగా జగన్ మీడియా సమావేశం నిర్వహించి ఏపీలోని కూటమి ప్రభుత్వం, చంద్రబాబు పాలనపై విమర్శలు గుప్పించారు. ▸▸తరువాయి2లో..

## పార్టీకి, నాకూ.. చెడ్డపేరు తీసుకు రావద్దు

- ప్రజలతో మమేకం కండి.. వారి సమస్యలు వినండి
- కేడర్‌ను విస్మరించినా సహించేది లేదు
- ఉచిత ఇసుకలో వేలు పెడితే ఊరుకునేది లేదు
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు ఘాటు హెచ్చరిక



**అమరావతి,అక్టోబర్18(నినాదం):**

ఏ ఒక్క ఎమ్మెల్యే వల్ల పార్టీకి, తనకు చెడ్డపేరు వస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయంలో నేతలకు స్పష్టత ఉండాలని మందలించారు. పార్టీ నేతలు ఎమ్మెల్యేలు, ఎంపీలను గౌరవించాలని అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేశారు. ▸▸తరువాయి2లో..



## మహిళలకు ఉచిత బస్సు హామీ ఏమయ్యింది

పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన షర్మిల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు.

▸▸వివరాలు 2లో..



## రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు

జనంలో రేవంత్‌కు వ్యతిరేకత రావాలని కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులే చూస్తున్నారని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల మీద దాడులు చేయడం దారుణమని చెప్పారు. గ్రూప్-1 అభ్యర్థులు చేసిన తప్పేంటీ అని ప్రశ్నించారు. ప్రభుత్వం దుర్మార్గంగా, రాక్షసంగా వ్యవహరిస్తోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టడం దారుణమని అన్నారు. ప్రభుత్వానిది చిల్లర నిర్ణయమని.. పేదల పొట్ట కొడుతారా అని బండి సంజయ్ మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరారు. విద్యార్థుల బతుకులను నాశనం చేస్తారా అని నిలదీశారు. 'రాత్రంతా లాటీ చేస్తారా, మీకు కేసీఆర్‌కు తేడా ఏంటీ' అని బండి సంజయ్ ప్రశ్నించారు.15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి..60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామంటారా.. ఇంతకంటే సిగ్గు ఉంటుందా.. కేసీఆర్ దారిలోనే మీరూ వెళ్తారా.. కేసీఆర్, రేవంత్ రెడ్డి దొందూ దొందే..మాజీ మంత్రి కేటీఆర్‌కు కొంచెమన్నా సిగ్గుందా.. గ్రూప్-1 ఉద్యోగులకు బ్రాండ్ అంబాసిడర్ లాగా ఫోజ్ ఇస్తున్నావా. 30 లక్షల నిరుద్యోగుల ఉసురు కేసీఆర్‌కే తగులుతుంది. కేసీఆర్, కేటీఆర్‌లను ఎవరూ నమ్మరు. నేనూ అశోక్ నగర్‌కు వెళ్తా. నిరుద్యోగుల కంటే నాకు కేంద్ర మంత్రి పదవి ఎక్కువ కాదు' అని బండి సంజయ్ అన్నారు.

## సుప్రీం చరిత్రలో మరో కొత్త అధ్యాయం

ఇప్పటికే అంటే సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన లబ సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిందే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదే నంటూ ఠాక్రే, శిందే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

## యదాతథంగా గ్రూప్-1 మెయిన్స్




రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్షాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 31,383 మంది అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఆంక్షలు అధికారులు విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు.ఇదిలా ఉంటే.. తెలంగాణ గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని ప్రధాన న్యాయమూర్తికి తమ న్యాయవాది వివరించారని విద్యార్థులు చెప్పారు. సోమవారం రోజు మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రకటిస్తూ విచారణను వాయిదా వేశారు. జీవో 55నే అమలు చేయాలని విద్యార్థులంతా కోరినా.. సీఎం పెడచెవిన పెట్టారని గ్రూప్ 1 అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టుతో మొట్టికాయలు కొట్టించుకోక ముందే ప్రభుత్వం దిగివచ్చి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో 29 వల్ల నష్టపోయే విద్యార్థుల గురించి ఎందుకు స్పందించడం లేదని గ్రూప్ 1 అభ్యర్థులు నిలదీస్తున్నారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లో ఇప్పటికే పోలీసులు దాడులు చేస్తున్నారని గ్రూప్ 1 అభ్యర్థులు వాపోయారు. గ్రూప్ 1 చదివే విద్యార్థులపై దాడులు చేస్తూ.. పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాల్సిందేనని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ 2.0 ఉద్యమాన్ని మళ్లీ చూస్తారంటూ రేవంత్ సర్కార్‌ను విద్యార్థులు హెచ్చరించారు. జీవో 29 గ్రూప్ 1 విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. సీఎం మొండిగా ఎందుకు వెళ్తున్నారో చెప్పాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని రాహుల్ గాంధీ చెప్తుంటే, రేవంత్ రెడ్డేమో ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో కేసీఆర్ జీవో 55 తెచ్చారని.. గ్రూప్ 1 లో రిజర్వేషన్లు అమలు అయ్యేలా తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీవో 29 తీసుకొచ్చారని.. దీని వల్ల గ్రూప్ 1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో న్యాయం జరుగుతుందనే ఆశాభావం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అశోక్ నగర్ వచ్చి విద్యార్థులతో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ముందు డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడున్న మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి అభివృద్ధి చేయవచ్చని సూచించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ ఎక్స్ రోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే గోపాల్‌తో కలిపి సేవరేజ్ లైన్‌ను కిషన్ రెడ్డి ప్రారంభించారు. 'మూసీ సుందరీకరణ పనులు చేయండి.. మూసీ పక్కన ముఖ్యమంత్రి ఇల్లు కట్టండి' మాకేమీ అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం.. రూ.25వేలు ఇస్తాం.. ఖాళీ చేయమనడం న్యాయం కాదని హితవు పలికారు. స్థానిక ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చని సూచించారు.

## కుల గణనకు మద్దతు ఇవ్వండి

ఈ సందర్భంగా వారు కులగణన అంశాన్ని వివరించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల సమగ్ర కుల గణన, రిజర్వేషన్ల పెంపుకు సహకరించి, మద్దతు తెలపాలని కిషన్ రెడ్డిని కలవడం జరిగిందని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సమగ్ర కుల గణన చేపడతామని హామి ఇచ్చారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారని, బీసీల సమగ్ర విచారణ జరపాలని అనేక పోరాటాలు చేశాం, హై కోర్టు కు సైతం వెళ్ళడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా..'కోర్టు కూడా మూడు నెలల్లో సమగ్ర బీసీ కుల గణన జరపాలని చెప్పింది. రిజర్వేషన్లు తేల్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని హై కోర్టు చెప్పడం జరిగింది. హై కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర కుల గణన కోసం బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. కుల గణన కోసం ప్రభుత్వం జీవో 18 ని విడుదల చేయడం జరిగింది. బీసీ సమగ్ర కుల గణన, రిజర్వేషన్లపై సవివరంగా కిషన్ రెడ్డికి చెప్పడం జరిగింది. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు, సంపూర్ణ మద్దతు అందిస్తామని చెప్పడం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో కుల గణన జరగాల్సిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సిందే. 27 న సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ కుల గణనపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నాం అని జాజూల శ్రీనివాస్ అన్నారు.

## స్కిల్ వర్సిటీకి ఆదానీ గ్రూప్ 100 కోట్ల విరాళం



**మొదటిపేజీ తరువాయి**

ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం దీనికోసం వందకోట్లు కేటాయించింది. ఈ క్రమంలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ నేతృత్వంలో ఓ ప్రతినిధులు బృందం శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకుంది. తెలంగాణలో స్కిల్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ. 100 కోట్లను విరాళంగా ఇచ్చారు. దానికి సంబంధించిన చెక్కును అదానీ సిఎం రేవంత్ రెడ్డికి స్వయంగా అందజేశారు. లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్, హెల్త్‌కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్ అడ్మిషన్ పక్రియ పూర్తైంది. టీచింగ్ సైతం నడుస్తోంది. ఈ సందర్భాంగా తెలంగాణ సీఎం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ శ్రీ గౌతమ్ అదాని గారు మర్యాద పూర్వకంగా కలిశారు. అదానీ ఫౌండేషన్ నుంచి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100కోట్ల విరాళం చెక్కు రూపంలో అందజేశారు.' అని ముఖ్యమంత్రి ట్వీట్‌లో పేర్కొన్నారు.

## అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్




**మొదటిపేజీ తరువాయి**

లక్షన్నర కోట్లు ఎవరు అన్నారని అంటుండు. నల్లగొండకు మంచినీళ్లు ఇస్తుంటే మీకు మనసున పడుతలేదా అంటున్నాడు. నల్లగొండ జిల్లా ప్రజలను రెచ్చగొడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన ఇష్టం లేదని మీరంటే ఖర్చు పెట్టిన రూ. 140 కోట్లు నా ఆస్తి అమ్మేన కడుతా అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. రేవంత్ రెడ్డి అఫిడవిట్‌లో ఏమో రూ. 30 కోట్లే తన ఆస్తి అని చూపించాడు. మరి రూ. 140 కోట్లు తమ్ముడి స్వచ్ బయో కంపెనీ నుండి తేస్తాడా, బావమరిది అమృత్ కంపెనీ నుండి అమృతం ఏమైనా జుర్రుతాడా? అని కేటీఆర్ విమర్శించారు.

మూసీ మురికి కూపంగా మారిందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా.. మూసీని మురికి కూపంగా మార్చింది కచ్చితంగా గత పాలకులే.. అందులో సింహభాగం కాంగ్రెస్ ప్రభుత్వానిది అయితే.. కొద్దిభాగం టీడీపీ ప్రభుత్వానికి కూడా దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మూసీ స్టోరీ ఏంటని ఆలోచిస్తే.. మూసీ నది కృష్ణానదికి ఉపనది. పైన అనంతగిరి కొండల్లో ముచ్‌కుంద వద్ద మూసీ ఉద్భవించింది. 267 కి.మీ. ప్రయాణం చేసి హైదరాబాద్ నగరం మీదుగా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. 1591లో కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని మూసీ తీరాన నిర్మించారు. రెండు నదులుగా మూసా ఈసాగా ప్రారంభమై.. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద మూసీ నదిగా ఏర్పడుతాయి. గతంలో ఈ నదిని ముచ్‌కుంద అని కూడా పిలిచే వారు. 1908లో మూసీలో ఒక భయంకరమైన వరద వచ్చింది. కుంభవృష్టి లాంటి వర్షం పడడం కారణంగా అతి పెద్ద వరద సంభవించి 15 వేల మంది మరణించారు. చాలా మంది ఇబ్బంది పడ్డారు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ ప్రజలను వరద నుంచి కాపాడాలని చెప్పి.. నాటి ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిచి చర్చించారు. నాడు ఆయన డిజైన్ చేసింది ఉస్మాన్ సాగర్(గండిపేట) 1920లో పూర్తయింది, హిమాయాత్ సాగర్ 1927లో పూర్తయింది. ఈ రెండిరటి రిజర్వాయర్ల వెనుక ఒక ఉద్దేశం ఉంది. ఒకటి హైదరాబాద్ ప్రజలకు మంచినీరు అందించడం, రెండోది భారీగా వరదలు వచ్చిన వాటిని ఆపేందుకు, హైదరాబాద్‌లో ఆవాసాలు మునగకుండా, ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా.. రక్షణ కవచం లాగా ఉండాలనే ఉద్దేశంతో ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించారు. ఆ తర్వాత 95 ఏండ్ల పాటు మూసీలో ఏ ప్రభుత్వం గొప్పగా పని చేసింది లేదు అని కేటీఆర్ తెలిపారు. మూసీకి ఒక ప్రత్యేకత ఉంది. పశ్చిమాన ఉండే మంచిరేవుల వద్ద తీసుకుంటే.. ఈస్ట్‌లో ఉండే ఓఆర్ఆర్ దాకా 57.5 కిలోమీటర్లలో 84 మీటర్ల కిందకు ఫాస్ట్‌గా ప్రవహిస్తుంది. ఇది ప్రకృతి ప్రసాదించిన వరంగా చెప్పొచ్చు. వరద వేగంగా కిందకు జాలువారుతుంది. రెండోది గతంలో ఉన్న ఎంసీహెచ్, 2007-08లో ఏర్పడ్డ జీహెచ్ఎంసీ కానీ.. ఈ పరిధి తీసుకుంటే 90 శాతం రెయిన్ వాటర్, 90 శాతం సీవరేజ్ కానీ గ్రావిటీ ద్వారా మూసీలోకి వస్తుంది. 54 ప్రధాన నాలాలు ఉన్నాయి. అవన్నీ కూడా 90 శాతానికి పైగా గ్రావిటీ రూపంలో ఉన్నాయి. నాచారం, జీడిమెట్ల, బాలానగర్, మల్లాపూర్ నుంచి కొన్ని వ్యర్థాలు 90 శాతానికి పైగా మూసీలో కలుస్తున్నాయి. మూసీలో ఒక్క చుక్క నీరు వదిలినా నిల్వదు.. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తినా జరజర నీరు కిందకు పోతోంది. అలా మోక్షగుండం విశ్వేశ్వరయ్య రిజర్వాయర్లను ప్లాన్ చేశారు. ఎలాంటి ఉపద్రవం లేకుండా బ్యాలెన్సింగ్‌గా రూపొందించారు. ప్రాణ నష్టం లేకుండా కాపాడుకోవచ్చు అని చాలా ముందు చూపుతో మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ రెండు రిజర్వాయర్లను కట్టించారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిపోర్టు తెప్పించుకున్నాం. మూసీ మురికికూపంగా మారింది. బీవోడీ, సీవోడీ ఈ రెండిరటిలో కూడా మూసీ ప్రమాదభరితమైన స్థాయిలో ఉందని రిపోర్టులో చెప్పారు. 2016 దాకా మున్సిపల్ మినిస్టర్‌గా కేసీఆర్ ఉన్నారు. ఆ తర్వాత నేను మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాను. కేసీఆర్ మార్గదర్శకత్వంలో అక్కడ ఉండే పరిస్థితులను అధ్యయనం చేసి పునరుజ్జీవం, సుందరీకరణ చేసే విధంగా సంకల్పించాం అని కేటీఆర్ తెలిపారు.

## మహిళలకు ఉచిత బస్సు హామీ ఏమయ్యింది

విజయవడ, నినాదం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. బస్సులో ఆమె విజయవాడ బస్ స్టాండ్ నుంచి తెనాలి వరకు ప్రయాణం చేశారు. తెలంగాణ, కర్ణాటకలో మాదిరిగానే ఏపీలో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. బస్సులో సాటి ప్రయాణికులతో ఆమె ముచ్చటించారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం అవసరమా.. లేదా..? అని మహిళలను ప్రశ్నించారు.పలువురు మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరూ ఉచిత బస్ సౌకర్యం కావాలనే చెప్పారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ నేతలు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని ఎందుకు నెరవేర్చడం లేదని షర్మిల ప్రశ్నించారు. ఇచ్చిన హామీని మర్చిపోయారా..? అని నిలదీశారు. కాగా, ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు కొందరు షర్మిలతో సెల్ఫీలు తీసుకున్నారు.

## బండి సంజయ్‌తో గ్రూప్-1 అభ్యర్థుల భేటీ

**తమకు అండగా నిలవాలని వినతి**

కరీంనగర్,అక్టోబర్18(ఆర్ఎన్ఎ): గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అభ్యర్థులు పలువురు కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయడంలో తమకు సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు. న్యాయం కోరితే రక్తం కళ్లజూస్తారా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలి పెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రూప్ ? 1 అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అశోక్ నగర్ నుంచి ఉద్యమం తెలంగాణ అంతా వ్యాపిస్తుందని హెచ్చరించారు. సమస్య తీవ్రం కాకముందే ప్రభుత్వం దిగిరావాలని సూచించారు.

## పార్టీకి, నాకూ...చెడ్డపేరు తీసుకుని రావద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... ఎంపీలు, ఎమ్మెల్యేలను కలుపుకుని పోవాలని అన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కేడర్‌ను పట్టించుకోవడం లేదని అన్నారు. కేడర్‌నీ నిర్లక్ష్యం చేస్తున్నారని.. తన దగ్గర అన్ని వివరాలు ఉన్నాయని చెప్పారు. ఏ వ్యక్తి కూడా పార్టీ, కేడర్ లేకుండా గెలవలేరని ఎం చంద్రబాబు అన్నారు. 'పార్టీ ఇచ్చిన విజయం మీది. పార్టీ వద్దు అనుకునే వారు ఇండిపెండెంట్‌గా గెలవాలి. పార్టీని రీస్టక్చర్ చేసిన ప్రతిసారీ కార్యకర్తలు అర్థం చేసుకుని మద్దతుగా నిలిచారు. కార్యకర్తలు అధిష్ఠానం నిర్ణయాలకు మద్దతు పలికారు. పార్టీ ద్వారా గెలిచిన వారు పార్టీ సిద్ధాంతాలు, నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలి. పొలిటికల్ గవర్నరెన్స్ అంటే ప్రజలకు చేసే మంచిలో మనం భాగస్వాములుగా ఉండటం. పార్టీని క్యారీ చేయాలి. ఇది జరగకపోవడంతోనే గతంలో నష్టం జరిగింది. తప్పు చేసిన వారిని చట్టబద్ధంగా శిక్షిద్దాం. ఇష్టం వచ్చినట్లు అరెస్టులు జరగాలి అంటే కుదరదు. అది నా విధానం కాదు. చెడ్డపేరు తెచ్చుకునేందుకు మాత్రం నేను సిద్ధంగా లేను. ఇసుక విషయంలో ఎవరు వేలు పెట్టవద్దు....ఇసుక విషయంలో తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని అధికారులకు స్పష్టంగా చెప్పా. ఇసుక విధానం సక్రమంగా అమలు కాకపోతే అధికారులను కూడా బాధ్యులను చేస్తా. అధికారులు నిబంధనల అమల్లో కఠినంగా ఉండాలి' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2029లో మళ్లీ మీ అందరినీ గెలిపించుకోవాలని చూస్తున్నా.. మీ పనితీరు కూడా బాగుండాలి. మీ పనితీరుపై మళ్లీ త్వరలో ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం, ఫీడ్ బ్యాక్ తీసుకుంటా. ప్రజలనుంచి వస్తున్న వినతులను పరిష్కరించే విషయంలో ఎమ్మెల్యేలు శ్రద్ధ చూపాలి. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంపై పర్యవేక్షణకు మంత్రులతో సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నాం. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని పరిష్కరించే విధానం తీసుకువద్దాం. కేంద్ర ప్రభుత్వం ఏపీలో హైవేల నిర్మాణంపై లక్ష కోట్లు ఖర్చు పెట్టబోతోంది. అలాగే రైల్వేలో రూ. 75 వేల కోట్ల పనులు ఏపీలో జరగనున్నాయి. ఈ పనులు వేగంగా పూర్తి అయ్యేలా మనం కూడా సహకరించాలి. వీటిపై ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓనర్ షిప్ తీసుకుని పనిచేయాలి. అప్పుడు ప్రజల్లో మంచి పేరు వస్తుంది. ఆ ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా దృష్టిపెట్టాలి. కూటమి నేతలతో కూడా సమన్వయం చేసుకోవాలి' అని సీఎం చంద్రబాబు వెల్లడిరరు.

## ఎపిలో మాఫియా రాజ్యం నడుస్తోంది

**మొదటిపేజీ తరువాయి**

చంద్రబాబు సర్కార్‌లో కప్పం కట్టనిదే ఏ పనీ జరగదని జగన్ అన్నారు. అబద్ధాలకు రెక్కలు కట్టి ప్రజల ఆశలతో ఆయన చెలగాటం ఆడారని జగన్ అన్నారు. ఎన్నికల వేళ సూపర్ సిక్స్ అని ఊదరకొట్టారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా సూపర్ సిక్సూ లేదు, సూపర్ సెవెనూ లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే స్వరాలు వినపడకుండా చేయాలని సీఎం చూస్తున్నారని, ఏపీలో మాఫియా రాజ్యం నడుస్తోందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. మద్యం, ఇసుక పాలసీల్లో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రశ్నించిన వారిని భయపెడుతున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందంటున్నారని వెల్లడిరచారు. మార్పుల పేరుతో స్కాంలకు తెరలేపారని మండిపడ్డారు. మద్యం టెండర్లలో కుంభకోణానికి తెరతీశారని విమర్శించారు. వైసీపీ హయాంలో ఒక్క డిస్టిలరీ కూడా లైసెన్స్ ఇవ్వలేదని అన్నారు. వైసీపీ హయాంలో నాసిరకం మద్యం విక్రయించారని ప్రచారం చేసిన టీడీపీ నాయకులు అదే డిస్టిలరీ నుంచి మద్యం తీసుకుంటూ నాణ్యమైన లిక్కర్ అంటూ ఊదరగొడుతుందని ఆరోపించారు. ఉచిత ఇసుక పేరుతో స్టాక్ యార్డులు దోచేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఇసుక పాలసీ పారదర్శకంగా ఉండేదని పేర్కొన్నారు. ఈ టెండర్ నిర్వహించి ప్రభుత్వానికి ప్రతి యేట రూ. 750 కోట్లు ఆదాయం తీసుకురాగా, నేడు ఆదాయం లేకుండా చేశారని వివరించారు. టెండర్లకు కేవలం రెండు రోజులు గడువు ఇచ్చి సొంతవాళ్లకు దోచిపెట్టారని ఆరోపించారు. ఏపీలో దోచుకో, పంచుకో, తినుకో పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజల ఆశలతో చెలగాటం ఆడారని, అబద్దాలకు రెక్కలు తొడిగారని విమర్శించారు. రూ. 10 వేలు జీతం అంటూ వాలంటీర్లను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 నెలలుగా సూపర్ సిక్స్ జాడే లేదని వెల్లడిరచారు. కనీసం బ్జడెట్ కూడా పెట్టలేని అసమర్థ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ఓటు అన్ అకౌంట్‌తో ఇంత కాలం నడిచే ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడ లేదంటూ ఎద్దేవా చేశారు. ఇసుక, మద్యం,పేకాట క్లబ్బులు ఏ నియోజకవర్గంలో చూసినా విచ్చలవిడిగా కనిపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేకు, సీఎంకు ఇంత అంటూ కప్పం కట్టకుండా ఏ పని చేయలేని పరిస్థితి నెలకొందని విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో అబద్దాలకు రెక్కలు కడతారని... ప్రజల ఆశలతో చెలగాటం ఆడతారని మండిపడ్డారు. 'అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితిలో ఉంది... చేయాలని ఉన్నా... చేయలేకపోతున్న అని అంటారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారి స్వరం వినపడకుండా చేస్తారు. మార్పు పేరుతో స్కాంలకు తెరలేపుతారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకకు సంబంధించి దారుణమైన స్కెచ్‌లు గీశారన్నారు. 141 నియోజకవర్గాలలో లారీ ఇసుక రూ.20వేలు ఉందన్నారు. ముప్పై నియోజకవర్గాల్లో ముప్పైవేల పైనే ఉందన్నారు. గత ప్రభుత్వం కన్నా రెండు, మూడు రెట్లు ఇసుక రేట్లు పెరిగాయన్నారు. అధికారంలోకి రాగానే లెఫ్ట్ రైట్ దోచేశారని ఆరోపించారు. దసరా పండుగలో అందరూ నిమగ్నమై ఉంటే... రెండు రోజుల్లో 108 రీచ్‌లకు టెండర్ పిలిచారన్నారు. 'ఎవరైనా ఎప్పుడైనా ఇలా చేయడం చూశారా.. ఒక మాఫీయా తయారు అవ్వడం... ప్రభుత్వం దగ్గర ఉండి తమ వారి చేత దోపిడీ చేయించడం. ఆ తరువాత నీకు ఇంత... నాకు ఇంత అని పంచుకోవడం. 2014 నుంచి 2019 వరకు ఇదే పద్ధతి అమలు చేశారు.





బీజేపీతో భాగస్వామిగా ఉన్నారు కాబట్టి నిస్సిగ్గుగా దోపిడీ చేస్తున్నారు. వైసీపీ హయంలో కేంద్ర ప్రభుత్వ ప్లాట్ ఫాం మీద ఈ టెండర్లు పిలిచాం. పేరుకు మాత్రమే ఉచిత ఇసుక...ఎవరికి ఉచిత ఇసుక ఇస్తున్నారు. గతంలో వున్న రేటు కన్నా రెండు, మూడు రెట్లు ఎక్కువ రేటుకు ఇసుక అమ్ముతున్నారు' అంటూ జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

సంపాదకీయం

## ఉపాధి రంగాలను
# బలోపేతం చేయాలి!

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్నాయి. స్కిల్ లేకపోవడం వల్లనే అని తెలంగాణ సిఎం రేవంత్ ఇటీవలే ప్రకటించి, స్కిల్ వర్సిటీకి పునాది వేశారు. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యా రంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా రాణిస్తారు. అది ఓ పక్క జరుగుతుండగానే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చేలా చేయాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా యుద్ధప్రాతిపదికన సాగాలి. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎందుకంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ త్వరలో అమెరికా వెళ్లనున్నారు. పారిశ్రామకవేత్తలకు చంద్రబాబ కూడా రెడ్ కార్పెట్ పరిచారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎపుడో వచ్చింది. ప్రభుత్వ ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయన్నది ఆలోచించాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు ఉండరాదు. ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్ కొతా చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. గంగవరం పోర్టులాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు ఏమవుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పడివున్నారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడిరది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి.ప్రజల భాగస్వామ్యం ఉన్నా ఏవీ మెరుగ్గా ఒరగబెడుతుందో ప్రభుత్వం చెప్పాలి. నిజంగా చెప్పాలంటే ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలి కొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని అర్థం చేసుకోవాలి. నీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. ఆయా కంపెఈల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. అంటే భూములతో పాటు అన్ని వసతులు కల్పిస్తే లాభపడుతున్నది కేవలం పరిశ్రమల యజమానులే తప్ప ప్రజలు కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులు కల్పించే కంపెనీలను దగ్గరకు రాకుండా చూడాలి. ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉదద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. పెత్తందార్లను తయారు చేసి ప్రజలను వెట్టి చాకీరీ చేయించుకోవడానికి కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. అలాంటి వారి కోసం రైతులు ఎందుకు భూములు త్యాగం చేయాలి. ఎందుకు కూలీలుగా మారాలి అన్నది గుర్తించాలి. అలాకాకుండా భూముల్లో బంగారం పండిరచేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పర్యావరణం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తేనే ఉపాధి ఉద్యోగ రంగాలు బలపడతాయని గుర్తించాలి.

# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్



**అక్టోబర్ 19...**
**ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ వర్ధంతి**

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 – అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయన శాస్త్రజ్ఞుడు. ఆయనకు అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియ జెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశ పెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన – కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు.

అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదా గ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహద పడింది) ను ప్రతిపాదించాడు. ఆయన రూథర్‌ఫోర్డ్ – కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా –కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కేంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనం లోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడా లోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే యురేనియం, థోరియం లాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (Radio active decay) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్ధ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫా కిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువు లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్య రంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయో గిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల...

# అస్సాం ఒప్పందం సెక్షన్ 6(ఎ) సమర్ధనీయం

**సెక్షన్ 6( ఎ) మీద నిన్న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా కీలకమైంది. గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుందరేస్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం నాడు 4:1 మెజారిటీ తీర్పుతో అస్సాంలోని అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం మంజూరుకు సంబంధించిన పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6(ఎ) రాజ్యాంగ చెల్లుబాటును సమర్థించింది. అసోం ఒప్పందం అక్రమ వలసల సమస్యకు రాజకీయ పరిష్కారమని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ జె బి పార్థివాలా మాత్రం ఈ సెక్షన్ ఏకపక్షంగా ఉందని రాజ్యాంగ పరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పు ఇచ్చారు.**



సెక్షన్ 6( ఎ) అంటే ఏమిటి ?

1985 నాటి అస్సాం ఒప్పందాన్ని అనుసరించి 1985 పౌరసత్వ (సవరణ) చట్టంలో భాగంగా సెక్షన్ 6 (ఎ) రూపొందించబడింది. అస్సాం ఒప్పందం అనేది 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ చర్చలు జరిపి అస్సాం ఒప్పందాన్ని రూపొందడం జరిగింది. అస్సాం స్టూడెంట్స్ యూనియన్ , ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ లు 26 మార్చి 1971న పశ్చిమ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత బంగ్లాదేశీ వలసదారుల ప్రవాహానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సమూహాలు. ఈ త్రైపాక్షిక ఒప్పందం సెక్షన్ 6(ఎ )అస్సాం కోసం ఒక ప్రత్యేక నిబంధనను రూపొందించింది. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 (ఎ) ప్రకారం 1 జనవరి 1966 నుండి 25 మార్చి 1971 మధ్య భారతదేశంలోకి ప్రవేశించి అస్సాంలో నివసిస్తున్న వ్యక్తులు తమను తాము పౌరులుగా నమోదు చేసుకోవడానికి అనుమతించబడతారు. రాష్ట్రంలో "సాధారణంగా నివాసం" ఉన్న విదేశీయులు 10 సంవత్సరాల పాటు ఓటు వేయలేరు తప్ప భారతీయ పౌరుల అన్ని హక్కులు, బాధ్యతలను కలిగి ఉంటారు.

కట్–ఆఫ్ తేదీ ఎందుకు అవసరం?

పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి దారితీసిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, భారతదేశానికి వలస వచ్చినవారి భారీ ప్రవాహాన్ని చూసింది. 1971లో తూర్పు పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందే ముందు కూడా భారతదేశానికి వలసలు మొదలయ్యాయి. అందుచేత ఈ కట్ ఆఫ్ తేదీ అవసరం.

పౌరసత్వ చట్టం 1955 అంటే ?

భారతదేశంలో పౌరసత్వ విషయాలను నియంత్రించేందుకు పార్లమెంటు పౌరసత్వ చట్టం 1955ను రూపొందించింది. ఇది భారత పౌరసత్వాన్ని ఎవరు పొందవచ్చో, ఏ ప్రాతిపదికన పొందవచ్చో నియంత్రిస్తుంది. అక్రమ వలసదారులు భారత పౌరసత్వం పొందడం నిషేధించబడింది. పౌరసత్వ చట్టం – 1955 అమలులోకి వచ్చినప్పటి నుండి ఆరుసార్లు సవరించబడింది. 1986, 1992, 2003, 2005, 2015, 2019 సంవత్సరాల్లో సవరణలు జరిగాయి. చివరిసారిగా 2019లో తాజా సవరణ ఏంటంటే " 31 డిసెంబర్ 2014లో లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన కొంతమంది అక్రమ వలసదారులకు పౌరసత్వం మంజూరు చేయబడింది.

కీలకం ఎందుకు ?

ఈ తీర్పు చాలా కీలకమైంది.
మిగతా రాష్ట్రాల కంటే అస్సాంలో ఎక్కువ వలసలు ఉన్నాయి. అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం రాజకీయ పరిష్కారాన్ని చూపింది. కేవలం అస్సాంకే ఈ నిబంధన ఉండడం కీలకం.

**- జనక మోహన రావు దుంగ**



## పాలన చేతకాని
# కాంగ్రెస్ ప్రభుత్వం

**మూసీ చుట్టూ ముఖ్యమంత్రి ప్రదక్షిణం**
**ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్ :**
తెలంగాణ అభివృద్ధి, పాలన చేతకాకే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మూసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన చేతకాకే పనికిమాలిన మాటలు, పాగల్ పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు పరిపాలన, అభివృద్ధి చేయడం తెలియక మూసీ మురుగులో కాంగ్రెస్ పార్టీ పొర్లుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ నేతలు తమకు అంటిన మూసీ బురదను అందరికీ అందించాలని చూస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టుతోనే హైదరాబాద్ అభివృద్ధి అవుతుందని చెప్పే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. మూసీ ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తలసరి ఆదాయంలో (పర్ క్యాపిటా) తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అయ్యింది. మూసీ ప్రాజెక్టులో రూ.1.50 లక్షల కోట్లు దోచుకోకుండానే జీడీపీ అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం సాధించింది. బిల్డర్లు, రియల్టర్లను బెదిరించకుండానే ఐటీ ఎగుమతుల్లో బెంగళూరును హైదరాబాద్ దాటేసింది. మీ బడే భాయ్ మోదీ ఐటీఐఆర్ ని రద్దు చేసినా, తెలంగాణకు ఒక్క రూపాయి సహాయం చేయకపోయినా, ఐటీ ఎగుమతుల విషయంలో 2035 నాటికి చేరుకోవాల్సిన టార్గెట్‌ని 11 ఏళ్ల ముందేగానే 2023లో చేర్చిన ఘనత కేసీఆర్ నాయకత్వానిది. దిల్లీకి డబ్బు సంచులు పంపకుండానే తెలంగాణ విత్తన భాండాగారమైంది. దేశంలోనే ధాన్య సిరిగా మారింది. పేదల కంట కన్నీరు లేకుండానే పారిస్, బొగొటా, మెక్సికో సిటీ, మోంటేరియల్‌ను అధిగమించి ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ సిటీ అవార్డును హైదరాబాద్ దక్కించుకుంది. మూసీ నదికి అటు ఇటు అభివృద్ధి, ఆకాశ హర్మ్యాలు కడుతున్నప్పుడు మరి ఫోర్త్ సిటీ ఎందుకు?. మూసీ పక్కన పెట్టుబడి పెట్టేందుకు ఫోర్ బ్రదర్స్ మనీ స్పిన్నింగ్ కోసమా?. ఫ్యూచర్ సిటీ అని పొంకణాలు ఎందుకు ?. కుర్చీలో కూర్చుంటేనో, సమావేశాల్లో తల కిందకీ మీదకీ తిప్పితేనో అభివృద్ధి జరగదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా అంటూ ప్రభుత్వ బడి పిల్లల పరువు తీయకు. కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడతారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు' అని కేటీఆర్ అన్నారు.

# ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రాజమన్నార్ అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి

ఏలూరు జిల్లాలోని లోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6 వ రోజు శుక్రవారం చిన వెంకన్న రాజమన్నార్ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వామి వారి రథోత్సవం జరగనుంది.కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. కాగా శనివారం ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.కాగా గురువారం చిన వెంకన్న కల్యాణం తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితుడై, పెండ్లి కుమారుడిగా సర్వజగర కుడైన శ్రీవారు. బుగ్గన దుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ ఆండాళ్. దేవేరులను పరిణయమాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామి చిన్న మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ బద్భుత దృశ్యం ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. తొలుత రాత్రి తొక్కు వాహనంపై శ్రీవారు,అమ్మవార్ల కల్యాణమూర్తులను, ఉంచి అలంకరించి ఆట అనివేటి మండపంలో ఏర్పాటు. చేసిన వేదిక దగ్గరకు తీసుకొన్ని అక్కడ బంగారు సింహాసనంపై కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు కళ్యాణ తంతును ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్ష తో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని చేసి సర్వదేవతారాధన. సంకటం, కరణ పూజలు నిర్వహించారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధం కావాలి

### అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (నినాదం న్యూస్)**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఐడిఒసి సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్‌తో కలిసి పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో 297 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో వరి గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2320 , సాధారణ రకం ధాన్యానికి



రూ.2300 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని అన్నారు. మరి కొద్ది రోజుల్లో రైతులు ధాన్యం తెచ్చే అవకాశం ఉండడంతో వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలతో సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. ధాన్యం బరువు కొలిచే యంత్రాలు, గోనె సంచులు, ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు, రైతులకు తాగునీరు, తేమ కొలిచే యంత్రాలు వంటి అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ అనంతరం ఏ మిల్లుకు ట్రాన్స్ పోర్టు చేయాలనే అంశంపై అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం ట్యాబ్ ఎంట్రీ సహా ఇతర ప్రక్రియలు వేగంగా పూర్తి కావాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

**సన్నాలను గుర్తించడంలో అవగాహన తప్పనిసరి**

సన్న రకం వరి ధాన్యానికి సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న రకానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇస్తుందని, రైతులకు నష్టం కలగకుండా వాటిని సరిగా గుర్తించాలని చెప్పారు. ఆ తర్వాత సన్నాల గన్నీ బాగులను ప్రత్యేకంగా లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి సంచి పై నెంబర్ తప్పనిసరిగా వేయాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ డిఎం ఇర్ఫాన్, డిసిఓ ప్రసాద రావు, డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఆర్డిఓ పీడీ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, సివిల్ సప్లై అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లు, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా సభ్యులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు

### - విశాఖ, కాకినాడల్లో ఎడతెరిపిలేని వానలు

**విజయవాడ,అక్టోబర్18(నినాదం న్యూస్) :**

రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నం, కాకినాడలో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విశాఖ ఆర్కేబీచ్, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాకినాడ ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారిపోయింది. శుక్రవారం కూడా కాకినాడ నగరంలో కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల నుంచి ఏకధాటిగా వాన కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులకు బ్రేక్ పడిరది. బార్జీల నుంచి నౌకలకు బియ్యం రవాణా నిలిపివేశారు అధికారులు. అటు ప్రకాశం జిల్లా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లో వేకువజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. మార్కాపురం మండలం బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. తర్లుపాడు - మార్కాపురం మధ్య కొండ వాగు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిరది. మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు



ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. తుంగభద్ర జలాశయం, శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి 10 గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. పూర్తి స్థాయి నీటి మట్టం1633 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటి మట్టం 1631.93 అడుగులకు చేరింది. అలాగే ఇన్ ఫ్లోలో 50,593 క్యూసెక్కులు, అవుట్ 36,799 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 101.500 టీఎంసీలుగా నమోదు అయ్యింది..ఇటు నంద్యాలలోని శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. మరోవైపు కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# పెసా చట్టం నిబంధనలను పాటించాలి

- మద్యం దుకాణాలను గిరిజనులకే కేటాయించాలి
- సిఎం చంద్రబాబుకు సిపిఎం కార్యదర్శి లేఖ

**విజయవాడ,అక్టోబర్18 (నినాదం న్యూస్):**

ఏజెన్సీ ఏరియాలో పెసా చట్టం నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, మద్యం దుకాణాలు స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలు లబ్దిదారుల ఎంపిక, దుకాణాల ఏర్పాటుపై ప్రభుత్వ నోటిఫికేషన్ ను అనుసరించి గిరిజనేతరులు, స్థానికేతర గిరిజనులు ధరఖాస్తులు చేసుకున్నారు. గిరిజనేతరులు సిండికేట్లుగా ఏర్పడి తెలంగాణ రాష్ట్రం, సరిహద్దు జిల్లాల నుండి షాపులు దక్కించుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 దుకాణాలకు గాను సుమారు 2200 ధరఖాస్తులు ఆశావాహులు చేసుకున్నారు. దుకాణ లబ్దిదారుల ఎంపిక విషయంలో పెసా చట్టం నిబంధనలను ఉల్లంఘించారు. ఏజెన్సీ చట్టాలను ప్రభుత్వం గౌరవించలేదని, ఏజెన్సీ ప్రాంతంలో పైసా గ్రామసభకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలని ఏ.పి. పెసా రూల్స్ పేర్కొన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారం, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక న్యాయం మరియు మతపరమైన పద్ధతులు, సామాజిక వనరులు నిర్వహణ, పరిరక్షణ, సాంప్రదాయ పద్ధతులలో వివాదాలు పరిష్కరించుకోవడానికి పెసా చట్టం ప్రకారం, అధికారాలను అమలు చేసుకోవడంతో పాటు లబ్దిదారులను ఎంపిక చేయు అధికారం, మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం, రద్దుచేయడం అంతిమ అధికారాలు పెసా గ్రామసభకు మాత్రమే కలిగివున్నది. ఇట్టి విషయంలో పెసా గ్రామసభ ఆమోదం, తీర్మానం అత్యంత కీలకమైనది. అందువల్ల చట్టవిరుద్ధంగా ఏజెన్సీ ఏరియాలో అమలు చేస్తున్న మద్యం షాపులు వేలం రద్దు చేయాలని కోరుతునట్లు పేర్కొన్నారు. పెసా గ్రామసభకు మద్యం



దుకాణాలు వినియోగం, అనుమతి విషయంలో చట్టం ప్రత్యేకమైనది, అంతిమమైనది. కావున పెసా చట్టం సెక్షన్ 4 క్లాజ్ డి.ఎన్ ప్రకారం గ్రామసభకు శాసనపరమైన స్వయంపాలన అధికారం కలిగివున్నది. స్థానిక గ్రామసభ పరిధిలోనే స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలని, వీటిని అనుసరించి ఏజెన్సీ గ్రామ ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రకారం మద్యం దుకాణాల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలనచేసి గ్రామసభ పరిధిలోనే లబ్దిదారులను ఎంపిక చేయాలి. అర్హత కలిగిన దరఖాస్తుదారులను గ్రామసభకు తెలియపర్చడంతో పాటు మద్యం దుకాణాల విషయంలో గిరిజనులకు లైసెన్స్ గ్రామసభ పరిధిల్లోనే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్కు తగిన ఆదేశాలు జారీచేయాలని కోరుతున్నాం. ఏజెన్సీ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలా? వద్దా? అనే అంశాన్ని పెసా గ్రామసభ సమక్షంలో చేతులు ఎత్తటం ద్వారా మెజార్టీ ఓటింగ్ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానట్లు లేఖలో పేర్కొన్నారు.

# శ్రీశైలానికి భారీగా వరదనీరు

### - ఒక్కగేటు ఎత్తి నీటి విడుదల

**నంద్యాల,అక్టోబర్18(నినాదం న్యూస్)**

ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీశైలానికి జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఒక క్రస్టు గేటు 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిండా నీళ్లు, గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీళ్లతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు కనుల విందు చేస్తుంది. శ్రీశైలం ప్రాజక్టు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్న వరద నీటితో ఇన్ ఫ్లో పెరిగింది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 93వేల 270 క్యూసెక్కులుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయినీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. ప్రాజక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 212.9198 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లోరెండిరటిలోనూ విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. గేట్ల ద్వారా ఔట్ ఫ్లో 95వేల 626 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు.

# ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం




### - సిపిఎం ఆధ్వర్యంలో మైలవరంలో ర్యాలీ

**విజయవాడ,అక్టోబర్18(నినాదం న్యూస్) :**

ట్రూ అప్ చార్జీలపేరుతో రూ.8, 114 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపద్దని సిపిఎం పార్టీ మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మైలవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, కోట కళ్యాణ్ లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపాలని చూస్తున్నారని, గతంలో కూడా టిడిపి అధికారంలో ఉన్న సమయంలో కరెంట్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని మరల ఈ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు రావూరి రమేష్ బాబు, సిహెచ్ సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లంక వెంకటేశ్వరరావు, మంద స్వామి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# టూవీలర్‌పై నుంచి పడి ప్రమాదం

### - టీచర్ మృతి

**వినుకొండ,అక్టోబర్18 (నినాదం న్యూస్)**

పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి(41) రోడ్డు ప్రమాదంలో మరణించారు. నాగులవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. మృతురాలి భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా అద్దంకి చెందిన ధనలక్ష్మి మండలంలోని గోకన కొండ స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. ప్రతిరోజు టీచర్ ధనలక్ష్మి అద్దంకి నుండి గోకనకొండ స్కూలుకు వస్తారు. ఆర్టీసీ బస్సులో నాగులవరం వద్దకు వచ్చి అక్కడ ఉంచిన తన స్కూటీ వాహనంపై స్కూలుకు వెళ్తారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు గత మూడు రోజుల క్రితం గోకన కొండ నుండి స్కూటీపై అద్దంకి వెళితూ చక్రాయపాలెం స్కూల్లో పార్క్ చేసి వెళ్లారు. శుక్రవారం గోకనకొండ స్కూలుకు బయలుదేరి తన స్కూటీ తీసుకుని వచ్చేందుకు చక్రాయపాలెం స్కూల్ వద్దకు ఉదయం 8:30 వెళ్ళగా స్కూలు తాళం తీయకపోవడంతో తోటి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం ఎక్కి గోకన కొండకు బయలుదేరారు. నాగులవరం గ్రామం వద్దకు రాగానే ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ద్విచక్ర వాహనం మార్జిన్ దిగి రోడ్డుపై ఎక్కుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి రోడ్డుపై పడి తల వెనుక భాగం పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 22, 23 తేదీలలో అమరావతి డ్రోన్ సమ్మిట్

### - అధికారులతో సమీక్షించిన సిఎస్ నీరబ్

**అమరావతి,అక్టోబర్18(నినాదం న్యూస్)**

డ్రోన్ సమ్మిట్‌పై వివిధ శాఖల సెక్రెటరీలు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లతో ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 22, 23 తేదీలలో అమరావతి డ్రోన్ సమ్మిట్ జరగనుంది. డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సవిరీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయి డ్రోన్ సమ్మిట్ కావడంతో ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో 5500కు పైగా డ్రోన్లను వినియోగించనున్నారు. డ్రోన్ సమ్మిట్ ఏర్పాట్లను స్పెషల్ చీఫ్ సెక్రటరీ సురేష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. 14 రకాల థీమ్స్‌తో డ్రోన్ సమ్మిట్‌ను అమరావతిలో నిర్వహించనున్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగి ఇష్టారాజ్యం కథనం అవాస్తవం

### - భూపాల్ పల్లి తహసిల్దార్ వై శ్రీనివాసులు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 నినాదం న్యూస్**

భూపాల్ పల్లి తాసిల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి ఇష్ట రాజ్యమనే సాయంకాల దినపత్రికలో ప్రచురితమైన వార్త అవాస్తమని భూపాలపల్లి తహసిల్దార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై సంబంధిత పోన్నం సరోజన పేరును పొన్నం సమ్మక్కగా మార్చుటకై తాసిల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ సెక్షన్ ఉద్యోగి 4వేల రూపాయలు తీసుకున్నాడని న్యూస్ ఓ దినపత్రికలో ప్రచురితమైతే పొన్నం సారమ్మ కుమారుడు అయినటువంటి పొన్నం శ్రీనివాస్, బండి తిరుపతి, మామిళ్ల శ్రీనివాస్ అనేవారు భూపాలపల్లి తాసిల్దార్ ముందర హాజరై పొన్నం సమ్మక్క పని నిమిత్తం తాసిల్దార్ కార్యాలయంలో ఎవరికి కూడా ఇలాంటి డబ్బులు ఇవ్వలేదని, ఏ న్యూస్ ఛానల్‌ను మేము సంప్రదించలేదని ఓ పత్రికలో వచ్చిన వార్తకు తమకు ఎలాంటి సంబంధం లేదని అది అంత అవాస్తమని పొన్నం సమ్మక్క కుమారులు తెలిపారు.

# జూనియర్ అసిస్టెంట్‌కి ఘన వీడ్కోలు



**కోదాడ,అక్టోబర్ 18,(నినాదం న్యూస్):**

జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ నుండి బదిలీపై వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్ మంగకు శుక్రవారం పాఠశాల సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ సుశీల భాయి మాట్లాడుతూ.. బాలికల ఉన్నత పాఠశాలలో మంగా ఎన్నో విశిష్ట సేవలు అందిం చారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 20న రాజకీయ శిక్షణ తరగతులు : సిపిఐ



**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (నినాదం న్యూస్)**

వనపర్తి జిల్లా పరిధిలోని పానగల్ మండల కేంద్రంలో ఆదివారం అక్టోబర్ 20వ తేదీన సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్ తెలిపారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ రాజకీయ విధానం క్యాడర్లోకి బలంగా తీసుకువెళ్లి, గ్రామాల్లో పార్టీని పటిష్టం చేయటం, ప్రజా సమస్యలపై పోరాటం లక్ష్యాలుగా తరగతులు ఉంటాయన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ఎండి యూసఫ్, ఉమా మహేశ్వర్, జిల్లా కార్యదర్శి విజయరాములు 'సమకాలీన రాజకీయాలు వివిధ రాజకీయ పార్టీలు సిపిఐ విశిష్టత పార్టీ నిర్మాణం అంశాలపై ప్రసంగిస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ బాధ్యులు పాల్గొనాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కళావతమ్మ, గోపాలకృష్ణ, నాయకులు జయమ్మ, వెంకటమ్మ లు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు పాల్పడ్డ ప్రేమ జంట

**గుంటూరు, అక్టోబర్18 (నినాదం న్యూస్) :**

గుంటూరు జిల్లాలో ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడిరది. యువతి, యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. పెదకాకాని వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను దానబోయిన మహేశ్(22), నంద్రు శైలజ(21)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని గ్రామానికి చెందిన మహేశ్, నందిగామ మండలం రుద్రవరానికి చెందిన శైలు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. మహేశ్.. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఓ మొబైల్ స్టోర్‌లో పని చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న శైలజతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇటీవలే ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలిసింది. 10 రోజుల క్రితం యువకుడి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించారు. యువతి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. దసరా సమయంలో శైలు, మహేశ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం పెదకాకాని సవిరీపంలో రైల్వే ట్రాక్‌పై విగత జీవులుగా కనిపించారు.

# 'మహిళా శక్తి'తో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



- ఇందిర మహిళా శక్తి పథకంతో ఎదగాలి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఇందిర మహిళా క్యాంటీన్ మెప్మా పిడి స్వరూప రాణి

**జమ్మికుంట, అక్టోబర్ 18 ( నినాదం న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిర మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని తమ కుటుంబాలని బలోపేతం చేసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూప రాణి కోరారు. జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ లో మహిళ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన స్టార్ ఫుడ్ ఇందిరామహిళ శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం వారు జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశని స్వప్న - కోటితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దీని ద్వారా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి సొంతంగా ఉపాధి పొందవచ్చని సొంతంగా వ్యాపారం చెయ్యవచ్చు అని అన్నారు. నైపుణ్యం ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటికే పరిమితమైన గ్రామీణ ప్రాంత మహిళలకు అవకాశాలు అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపటిందన్నారు. మహిళల స్వయం ఉపాధికి బాటలు వేయడంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు 12 రకాల యూనిట్స్ ఇస్తుందన్నారు. ఇందులో పాడి పశువులు, మీ సేవా కేంద్రాలు, సోషల్ మొబిలైజేషన్, కుటీర పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్లు, మిల్క్ పార్లర్లు, అమ్మ క్యాంటీన్లు, క్యాటరింగ్, బ్యూటీషియన్, ప్రింటింగ్, సౌండ్ సిస్టమ్, డెకరేషన్, టెంట్ హౌస్ల నిర్వహణ వంటి యూనిట్లు ఉన్నాయని అన్నారు. వ్యక్తిగతంగా మహిళలు ముందుకొస్తే ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా బ్యాంకు రుణం రూ.2.5 లక్షల నుండి రూ.3.5 లక్షలు అందిస్తారని, గ్రూప్‌ల వారీగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు రూ.20 లక్షల వరకు అందిస్తారని అన్నారు. జమ్మికుంటలో ఏర్పాటుచేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా అందరికీ నాణ్యమైన భోజనం అందిస్తూ సేవలందించాలని కోరారు. ప్రస్తుతం ఈ క్యాంటీన్లో ఉదయం టిఫిన్ సాయంత్రం స్నాక్స్ అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని రాబోయే రోజుల్లో మధ్యాహ్నం భోజనం తో పాటు చుట్టుపక్కల పలు ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నందున మిల్లెట్స్ కు సంబంధించిన ఫుడ్ కూడా అందించాలని నిర్వాహకులకు వారు సూచించారు. భవిష్యత్తులో స్టార్ ఫుడ్ సెంటర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

## ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలి

### - మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న - కోటి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగ పరుచుకోవాలని జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న -కోటి తెలిపారు..స్టార్ ఫుడ్ ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న - కోటి మాట్లాడుతూ జమ్మికుంటలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుతో మహిళలకు స్వయం సమృద్ధి లభిస్తుందని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మహిళలను కోటీశ్వరుని చేయాలని అటువంటి దృక్పథంతో ఏర్పాటు చేసిన కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ఆర్థిక చేయూతనందించి ప్రోత్సహిస్తుందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. పథకం మహిళలు ఉపాధిని పొందుతూ ఇతరులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఫుడ్ సెంటర్ యజమానులు రాస మల్ల శేఖర్ వారి కుటుంబ సభ్యులు మహిళా సంఘ సభ్యులు ఆర్పి విజయ, శివశక్తి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# తిరుమల భక్తులకు శుభవార్త

- జనవరి ఆర్జిత సేవాటిక్కెట్లు
- నేడు విడుదల చేయనున్న టిటిడి

**తిరుమల,అక్టోబర్18(నినాదం న్యూస్)**

ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారికి కోట్లాది మంది భక్తులున్నారు. వారంతా ఏడాదిలో ఏదో ఒక రోజులో.. ఆయన్ని దర్శించుకునేందుకు తిరుమలకు తరలి వస్తారు. ఆ క్రమంలో భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వివిధ చర్యలు చేపట్టింది. వారిని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఉన్న పలు సేవా టికెట్లను టీటీడీ విక్రయిస్తుంది. ఆ క్రమంలో 2025 జనవరికి సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను అక్టోబర్‌లో టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది.




అందులోభాగంగా తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి జనవరి కోటాను శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేయనుంది. సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబరు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకో వచ్చని టీటీడీ ప్రకటించింది. అయితే ఈ టికెట్లు పొందిన భక్తులు అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇక వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని వివరించింది. కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని వివరించింది. వర్షాకాలం కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక తిరుమలలో సైతం భారీగా వర్షం పడుతుంది. దీంతో తిరుపతి చుట్టుపక్కన ఆవరించిన ఏడుకొండలు సైతం పచ్చదనాన్ని పరుచుకుంది. ఓ వైపు వరుస సెలవులు రావడం.. వాతావరణం అహ్లాదకరంగా మారడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా క్యూ కడుతున్నారు.

# సన్నవడ్లకు రూ.500 బోనస్..

**48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ**

**కొత్తకొండలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి**



**భీమదేవరపల్లి,అక్టోబర్ 18(నినాదం న్యూస్):**
ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఐకెపి పంట కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. వడ్లకు ప్రభుత్వ కనీసం మద్దతు ధర 'ఏ' గ్రేడు రకం రూ .2320, సాధారణ రకం రూ .2300 ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటలు సన్న రకాలకు రూ.5 వందలు బోనస్ ఈ సీజాన్ నుండే ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. 33 రకాల వడ్లను సన్నలుగా గుర్తించామన్నారు. ప్రయివేటు మిల్లర్లకు అమ్మితే బోనస్ రాదన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతులు ప్రభుత్వ పంట కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 154 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. అనంతరం కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ నాగపద్మజ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, డిపిఎం ప్రకాష్, ఏవో పద్మ, నాయబ్ తహసిల్దార్ సూర్య, ఎంపీడీవో వీరేశం, ఏపిఎం దేవానంద్, ఏపీవో కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్, అనిల్, ఏఈఓ సుమలత, వీరభద్ర మహిళా సమైక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# పత్తిలో పచ్చ దోమ తాకిడి

**- పంటలను సందర్శించిన శాస్త్రవేతలు**



**కారేపల్లి అక్టోబర్ 18 (నినాదం న్యూస్)**



పత్తిలో పచ్చదోమ తాకిడి ఎక్కువ ఉందని వైరా కృషి విజ్ఞాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కే.రవికుమార్, శాస్త్రవేతలు పీఎస్ఎం ఫనీశ్రీ లు తెలిపారు. శుక్రవారం కారేపల్లి మండలం గేటురేలకాయలపల్లి ప్రాంతంలో పత్తి, మిర్చి పంటలను వ్యవసాయ శాస్త్రవేతలు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ వర్షపాతం, తక్కువ ఉష్ణోగ్రతలు వాతావరణంలో పచ్చదోమ ఉదృతి ఎక్కువ ఉంటుందన్నారు. రసం పీల్చే పురుగులు ఆకుల వెనక భాగంలో చేరి రసాన్ని పీల్చుతున్నాయని దీంతో ఆకులు ముడుచుక పోవటం, లేత పసుపు రంగులోకి మారి ఆకు ఎండిపోతున్నాయన్నారు. దీంతో పత్తి మొక్క ఎదుగుదల ఆగిపోయి దిగుబడి రాదన్నారు. దీనికి మోనోక్రోటోఫాస్1.6 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు, లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు, లేదా ఫ్లోనికామిడ్ 0.03 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డ్కఫెన్ థయూరాన్ 1.25 గ్రాములు లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేయాలన్నారు. జీవ రసాయనాల్కెన 5% వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పి.పి.యమ్ ) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. మిరప లో పొగాకు లద్దె పురుగు ఆశిస్తున్నట్లు గమనించడం జరిగిందన్నారు. పొగాకు లద్దెపురుగు లార్వాలు ఆకులకు చిన్న చిన్న రంధ్రాలు చేసి ఆకులను జల్లెడగా మారుస్తాయని, మిరపకాయలకు ఆశించి ముచ్చిక వద్ద రంధ్రం చేసి గింజలను మరియు గుజ్జును తింటాయన్నారు. పొగాకు లద్దెపురుగు ఎదిగిన లార్వాలను నివారణకు విషపు ఎరను ఉపయోగించాలన్నారు. 5 కిలోల తవుడు, 500 మీ.లి క్లోరిపైరిఫాస్, 500 గ్రా. బెల్లం తగినంత నీటికి కలిపి చిన్నచిన్న గుళికలు తయారు చేసి పొలంలో సమానంగా చల్లాలని సూచించారు. ఎకరానికి 4 లింగకర్షాక బుట్టలు పెట్టుకోవాలని, నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి. లి లేదా ఇండాక్సకార్బ్ 0.8 మి.లి లేదా ఇమమెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ఏడీఏ టీ.కరుణశ్రీ, కారేపల్లి ఏవో బీ.అశోక్‌కుమార్, ఏఈవో బీ.నరేష్, మాజీ సర్పంచ్ బానోత్ సక్రాం, గణితి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో అదనపు కలెక్టర్ తనిఖీలు

**భీమదేవరపల్లి,అక్టోబర్ 18(నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం, కొత్తకొండ గ్రామంలోని అంగన్వాడి 1వ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి తనిఖీ చేశారు. ప్రతి నెల పిల్లలకు చేసే ఆరోగ్య పరీక్షల వివరాలు ఆరా తీశారు. పిల్లల వయసుకు తగ్గ బరువు,ఎత్తు ఎదిగేందుకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాల గూర్చి ఐసిడిఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం రికార్డులు చూపించమని అనగా, వారు ఆప్ లో రోజు అప్లోడ్ చేస్తున్నామని తెలిపారు, మాన్యువల్ రికార్డ్ మైంటైన్ చేయడం లేదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అండర్ వెయిట్ పిల్లల పైఏ రకమైన చర్యలు తీసుకుంటున్నారని ఐసిడిఎస్ అధికారులను అడగగా, వారు బాలామృతం ఇతర పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు తెలపగా, వైద్యులు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. అంగన్వాడీల్లో విద్యుత్ కనెక్షన్లు లేకపోవడంతో పిల్లల ఇబ్బంది చూసి వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అనంతరం అంగన్వాడీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే అక్షయపాత్ర ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం, వంటగది, స్టోర్ రూమ్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ జయంతి, సిడిపిఓ స్వరూప, డిసి సుమలత, డాక్టర్ మనోహర్, ప్రణీత, మౌనిక, ఎంపీడీవో వీరేశం, నాయబ్ తహసిల్దార్ సూర్య, ఎంపీఓ నాగరాజు, పి ఆర్ ఏ ఈ వినయ్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# నిఘా నీడలో... తెలంగాణ 'ఏజెన్సీ'

**సేఫ్ జోన్ షెల్టర్ కోసం మావోయిస్టుల అన్వేషణ?**

**సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు చర్యలు**

**గోదావరి తీర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా**




**మణుగూరు అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :**
వరుస ఎన్కౌంటర్లతో ప్రతీకార చర్యతో రగిలిపోతున్న మావోయిస్టు పార్టీకి చెందిన నేతలు తెలంగాణ ఏజెన్సీ ప్రాంతంపై దృష్టి మళ్లి నట్లు సమాచారం. ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు భద్రత దళాల నిఘా నీడలో తెలంగాణ ఏజెన్సీ ప్రాంతం తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు సమాచారం. ఛత్తీస్గడ్ రాష్ట్రం అబూజ్మాడ్ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్కౌంటర్లో మావోయిస్టు పార్టీకి భారీగా నష్టం జరిగింది. దీంతో మావోయిస్టులు సేఫ్ జోన్ కోసం తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లో అన్వేషణ ప్రారంభించినట్లు ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం బట్టి తెలుస్తుంది. ఖచ్చితమైన సమాచారం మేరకు భద్రాద్రి కొత్తగూడెం ములుగు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు బలగాలను భారీగా మోహరించినట్లు సమాచారం. మావోయిస్టులు సంచరించే గోదావరి నది తీర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో పినపాక కరకగూడెం ములుగు జిల్లా మంగపేట తదితర ప్రాంతాల్లో పోలీస్ బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. సరిహద్దునున్న ఛత్తీస్గడ్ రాష్ట్రంలో భద్రత దళాలు దండ కారణ్యాన్ని ప్రతి అణు వణువున జల్లెడ పట్టడంతో, మావోయిస్టు పార్టీ మనుగడ ప్రశ్నార్థంగా మారింది. తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో సేఫ్ జోన్ గా ఎంచుకునేందుకు మావో యిస్టు పార్టీ నేతలు అన్వేషణ ప్రారంభించినట్లు సమాచారం. ఇప్పటికే మావోయిస్టు పార్టీలో ఉన్న యాక్షన్ టీన్స్ దండకార్యాన్ని విడిచి మైదాన ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం బట్టి తెలుస్తుంది. మణు గూరు సబ్ డివిజన్ పరిధిలో సరిహద్దునున్న తాడువాయి మంగపేట కరకగూడెం ఎడుల్లా బయ్యారం తదితర పోలీస్ స్టేషన్లో పోలీస్ బలగాలను ఉన్నతాధికారులు అప్రమత్తం చేసినట్లు సమాచారం. ఛత్తీస్గడ్ నుంచి వచ్చే మావోయిస్టులకు తెలంగాణ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడ కూడా షెల్టర్ జోన్ లేకుండా చేసేం దుకు, పల్లె ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గోదావరి నదిలో వరద ప్రవాహము తగ్గుముఖం పడటంతో తెలంగాణ ఏజెన్సీ ప్రాంతానికి ఛత్తీస్గడ్ ప్రాంతానికి రాకపోకలు సాగుతున్నట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం ములుగు జిల్లాల ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో మావో యిస్టులు రహస్యంగా ఐడి బాంబులు అమర్చి ఉండే అవకాశం ఉండటంతో, బాంబు స్క్వాడ్ నిపుణులు కూడా రంగంలోకి దింపి తీవ్ర ంగా అన్వేషణ ప్రారంభించినట్లు సమా చారం. సరిహద్దు ప్రాంతాల గ్రామాల్లో పోలీసులు నిఘా సంచారం పెరగడంతో, ప్రజలు బిక్కుబిక్కుమ ంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడపాల్సి వస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే అధికార పార్టీ నాయకులు బిజెపి నాయకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ, సేఫ్ జోన్ అయినా మైదాన ప్రాంతాలకు తరలి వెళ్లాలని హుకుం జారీ చేశారు. ప్రతి కార చర్యలతో రెచ్చిపోతున్న మావోయిస్టులకు కళ్లెం వేసేం దుకు పోలీసులు అదే తరహాలో అన్వేషణ ప్రారంభించినట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతాల్లో సంచరించే వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జికి ఘన సన్మానం

**మణుగూరు అక్టోబర్ 18( నినాదం న్యూస్) :**
మణుగూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జడ్జిగా విధులు నిర్వహిస్తున్న మీసాల వెంకటేశ్వర్లుకు సీనియర్ జడ్జిగా పదోన్నతి పొందారు. శుక్రవారం జడ్జి వెంకటేశ్వర్లను మణుగూరు కోర్టులో బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు ఘనంగా సన్మానించి సత్కరించారు. బార్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాదులు జడ్జి వెంకటేశ్వర్లను శాలువాతో సత్కరించి బొకేలు అందజేశారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాటా ్లడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎంతో నైపుణ్యంతో పనిచేసిన జడ్జి సేవలు ఏజెన్సీ ప్రాంతానికి శిరస్మరణీయమని అన్నారు. కోర్టు పరిధిలో కక్షిదారులకు న్యాయం అందించడంలో ఆయన చూపిన చొరవ ఎనలేనిదని వారు ప్రశంసించారు. మణుగూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక సభలు సమావేశాలు



నిర్వహించి పేదలకు న్యాయం జరిగే విధంగా అనేక మార్గాలు న్యాయ సూత్రాలు బోధించారని అన్నారు. పేదలకు న్యాయం జరిగే విధంగా కోర్టులో ఉచిత న్యాయ సలహా కోసం ప్రత్యేక వింగును ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో విధుల్లో ఉన్న జడ్జి న్యాయవాదుల పట్ల ఎంతో గౌరవ మర్యాదలు ఇచ్చేవారని వారు కొనియాడారు. పదోన్నతి పై వెళ్తున్న జడ్జి వెంకటేశ్వర్లు వారు ఈ ప్రాంతంలో అందించిన సేవలు, తీర్పులు చాలా ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. కక్షిదారులకు వెంటనే న్యాయం జరిగే విధంగా ఆయన తీసుకున్న చొరవ ఎనలేనిదని వారు పేర్కొన్నారు. కోర్టులో న్యాయవాదులను కోర్టు సిబ్బందిని చాలా గౌరవప్రదంగా పిలిచేవారని వారు పేర్కొన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు కక్షిదారులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి సొసైటీలో అందుబాటులో ఎరువులు

**- రుణాలు రెన్యూవల్‌తో వడ్డీ రాయితీ**

**- సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు**





**కారేపల్లి అక్టోబర్ 18 నినాదం న్యూస్**



కారేపల్లి సొసైటీలో రైతులకు అందుబాటులో వివిధ రకాల ఎరువులను అందుబాటులో ఉంచినట్లు సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సొసైటీలో యూరియా, 20.20.0.13, డీఏపీ, 10.26.26, 14.35.14 అందుబాటులో ఉంచామన్నారు. కావల్సిన రైతులు ఆధార్ కార్డుతో నేరుగా సంప్రదించాలన్నారు. సొసైటీ రుణాలు తీసుకోని రెన్యూవల్ చేయించుకోని రైతులు తప్పని సరిగా వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. రెన్యూవల్ చేయించుకున్న రైతులకు వారు కట్టిన 7శాతం వడ్డీలో 3శాతం వడ్డి రాయితీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. 3శాతం వడ్డీ రాయితీ కోసం రైతులు తప్పని సరిగా ఆధార్ కైవైసీ ని సొసైటీలో చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, పోతురాజు రమేష్, కార్యదర్శి బల్లు హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు గ్రామస్తులు ఘన సన్మానం



**ఆళ్లపల్లి అక్టోబర్ 18 నినాదం న్యూస్**
ఆళ్లపల్లి మండల పరిధిలోని తునికి బండల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘంగా 11 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎటువంటి అంతరాయాలు లేకుండా ఎంతోమంది గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించి దిగ్విజయంగా ఆ పాఠశాలలో వారి సేవలు పూర్తి సందర్భంగా ఈ మధ్యకాలంలో బదిలీపై వెళ్లిన హెడ్మాస్టర్ ఇస్లావత్ నరేష్, ఉపాధ్యాయురాలు సమ్మక్కలను తునికి బండల గ్రామస్తులు శుక్రవారం వారిని పట్టు శాలువాలతో, పుష్పగుచ్చాలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో... మండల విద్యాశాఖ అధికారి శాంతారావు, గ్రామ పెద్దలు పెద్ద లక్ష్మయ్య, ఎస్ఎంసి చైర్మన్ కృష్ణ. మాట్లాడుతూ నరేష్ సార్ మా గ్రామంలోకి వచ్చిన తర్వాత విద్యకు నాగరికతకు దూరంగా పేదరికానికి మూఢనమ్మకాలకు దగ్గరగా అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న గిరిజన బాలబాలికలకు విద్య బుద్ధులు నేర్పాలనే సంకల్పంతో మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామమైన తునికిబండల గ్రామం మా బడి రూపు రేకలే మారిపోయాయని అన్నారు. ఉపాధ్యాయుడు వచ్చినప్పుడు 11 మంది పిల్లలు ఉంటే ఇప్పుడు 40 మంది పిల్లలు స్కూల్లో ఉన్నారని, రెండు ఉత్తమ అవార్డులు పొందారని, బడికి రాని పిల్లల కోసం ప్రతిరోజు గ్రామంలో గాలింపు చేసే వారని పాఠశాలని మోడల్ స్కూల్‌గా మార్చారని హాకీంపేట స్పోర్ట్స్ స్కూల్లోకి ఆరుగురు విద్యార్థులను పంపించారని, ప్రతి సంవత్సరం విద్యార్థులు గురుకులంలో సీట్ సాధిస్తున్నారని కొనియాడారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుడు నరేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుండి వచ్చిన నేను ఈ గ్రామస్తులు చాలా చక్కగా చూసుకున్నారని ప్రతి కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించారని, జీవితంలో ఈ గ్రామాన్ని ఈ గ్రామస్తులనీ మర్చిపోవనని వారు ఉద్వేగంతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు, ఉపాధ్యాయులు బాలాజీ ముత్తయ్య రాము, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

**మండల విద్యాశాఖ అధికారి కె నాగయ్య**

**పినపాక (అక్టోబర్ 18),నినాదం న్యూస్**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల విద్యాశాఖ అధికారి కె నాగయ్య శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఉదయం 9 గంటలకు ఉప్పాక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల అసెంబ్లీలో పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మడతనకుంట, పెంటన్నగూడెం, బొమ్మ రాజుపల్లి, బందగిరినగరం, భూపాలపట్నం, బెస్తగూడెం, జగ్గారం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాల సమయపాలన పాటించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల సమయంలో చరవానిని వాడకూడదన్నారు. పాఠశాలకు గైహాజరు



అవుతున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వహించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు చొరవ చూపాల న్నారు. పాఠశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు అని తెలిపారు.



# రేపు జాతీయ ఆదివాసి అఖిల పక్ష ప్రజా సంఘాల సమావేశం

**- మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర**

**పినపాక, అక్టోబర్ 18, నినాదం న్యూస్**



భద్రాద్రి పవర్ ప్లాంటు మణుగూరు పినపాక మండలాల సరిహద్దు గ్రామం చిక్కుడుగుంట గ్రామంలో ఆదివారం ఉదయం 11 గంటలకు భూమి నిర్వాసితుల సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో భూములు కోల్పోయిన వారు, స్పెషల్ ప్యాకేజీల ప్రకారం నష్టం చెందిన వారు కలిసి చిక్కుడుగుంట గ్రామంలో సభ ఏర్పాటు చేశామని తెలిపారు. వాటి భవిష్యత్తుకు కార్యచరణ ఏర్పాటు చేయట కు నిర్ణయించడం అయినది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి అఖిల పక్ష ప్రజా సంఘాలు నాయకులు, భూములు కోల్పోయిన భూనిర్వాయితులు, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, మాజీ రాష్ట్ర తుడుందెబ్బ అధ్యక్షుడు వట్టం నారాయణ మొదలైన వారు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**అల్వాల్, అక్టోబర్ 18( నినాదం న్యూస్)**
ఓల్డ్ ఆల్వాల్ లోనిఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 55 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. అల్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1969లో ఎస్ఎస్‌సి మొదటి బ్యాచ్ శుక్రవారం పూర్వ విద్యార్థి కుక్కట్ల లక్ష్మయ్య నివాసంలో కలుసుకొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్ కుమార్, అంజయ్య, రామచందర్, బాల మల్లేష్, నరసింహ స్వామి, లక్ష్మణరావు, సత్యనారాయణ, కృష్ణారావు, అశోక్ కుమార్, నారాయణ, అంజనేయులు, శంకర్, రంగారావు, లక్ష్మయ్య, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమావేశం




**అల్వాల్, అక్టోబర్ 14( నినాదం న్యూస్)**
తెలంగాణ ఉద్యమకారుల మల్కాజ్గిరి నియోజకవర్గ సమావేశం పి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టియుఎఫ్ స్టేట్ జనరేటర్ సెక్రెటరీ పి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులకు పింఛన్. ఇళ్ల స్థలాల గురించి ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయాలని తీర్మానించారు. శోభన్, దయాకర్ గౌడ్, దేవేందర్, వెంకటేష్ యాదవ్, రమేష్, అవినాష్, పాల్గొన్నారు.

# కొనసాగుతున్న అయ్యప్ప స్వాములకు అన్నదానం



**కోదాడ (అనంతగిరి), అక్టోబర్ 18 (నినాదం న్యూస్):**
తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సన్నిధానంలో శుక్రవారం సైతం అన్నదానం కార్యక్రమం కొనసాగింది. దాతల సహకారంతో 48 రోజులపాటు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని దాతలు ఎవరైనా ఉంటే సహాయ సహకారాలు అందించేందుకు దేవాలయ కమిటీని సంప్రదించవలసిందిగా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. అయ్యప్ప సన్నిధిలో అయ్యప్ప మాల ధరించేందుకు సైతం భారీ సంఖ్యలో హాజరవుతున్నారని, కోదాడ నియోజకవర్గ వ్యాప్తం తో పాటు ఇతర ప్రాంతాల వారు సైతం మాలధార ధరించేందుకు అయ్యప్ప స్వామి సన్నిధిని దర్శించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పందిరి వీరయ్య, ఐతన బోయిన వెంకటేశ్వర్లు, కోదాడ అయ్యప్ప ఆలయ అర్చకులు దివాకర్ శర్మ, గాదం లింగయ్య, కొల్లూరి మహా లక్ష్మయ్య, ఈదుల యాదగిరి, దండు రమేష్, 200 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈఓ



**చౌటుప్పల్,అక్టోబరు 18(నినాదంన్యూస్):**
మండల పరిధిలోని తూప్రాన్‌పేట రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి సందర్శించారు. విద్యార్థినుల హాజరు శాతం, శానిటేషన్ తదితర వాటిని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి అక్కడే భోజనం చేశారు. పరిసర ప్రాంతమంతా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ ఈపిఆర్ మూమెంట్ చేయకుండా చూపకుండా అనధికారికంగా హాజరుకానందున వారికి మెమో జారీ చేయవలసిందిగా సూచించినారు. వారి వెంట ఎంపీడీవో యాకూబ్ నాయక్, ఎంపీఓ అంజిరెడ్డి,పర్యవేక్షకులువిజయ్ కుమార్ ,పంచాయతీ కార్యదర్శి, రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి రూ.25 కోట్ల నిధుల మంజూరు..!

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి



**కాటారం అక్టోబర్ 18 నినాదం న్యూస్ :** మంథని నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణానికి, గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం కింద రూ.25 కోట్లు మంజూరైనట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కాటారం-బూడిదపల్లి, గుంగ్రాత్ పల్లి -ఉట్లపల్లి, ఓడిపిలవంచ-గూడూరు, దామెరకుంట - ఆరెంద, రాజాపూర్-మంగపేట, కమాన్ పూర్-పెంచికలపేట, ఖానాపూర్, ఎల్ మడుగు మధ్యలో ఉన్న రోడ్లకు త్వరలో మహర్దశ రానుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి తెలుపుతున్నట్లు ప్రకటించారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- సన్న వడ్లకు ఏం ఎస్ పి తో పాటు 500 బోనస్ ఇవ్వనున్న మన ప్రజా ప్రభుత్వం
- రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** రైతులు క్షేమంగా ఉండాలి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే,మాజీ ఐపీఎస్ అధికారి నాగరాజు తెలిపారు.44వ డివిజన్ పరిధిలోని కడిపికొండ సూర్యకుటిర్ నందు కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) వారి ఆధ్వర్యంలో వానకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న వడ్లకు మార్కెట్ ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు దీని కోసం 25వేల కోట్ల నిధులను సమాకూర్చినట్లు తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులు ఎన్ని క్వింటాలు పండించిన 500బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డ రకం, సన్న రకం వడ్లను వేరు వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు రెండు, మూడు రోజులలో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని అన్నారు, అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, గురుకులాలకు సన్న బియ్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సన్న వడ్లకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలలలోనే 18వేల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు, మరో 3,4 నెలలలో మరో 12వేల కోట్ల రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలు మాట్లాడాలని సూచించారు. 43లక్షల మంది రైతులకు 31వేల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమనీ అన్నారు. అర్హులైన రైతులందరికి రుణ జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు.. వర్ధన్నపేట నియోజకవర్గం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళల ద్వారా నిర్వహించాలానే ఐ కే పీ లు, పాక్స్ వార్ల అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు.అనంతరం పాక్స్ ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోసం 5 లక్షల చెక్ అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, పాక్స్ ఛైర్మన్, డైరెక్టర్స్, వ్యవసాయ శాఖ అధికారులు, ఎమ్మార్వో, కార్పొరేటర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మాతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



**చింతపల్లి, అక్టోబర్ 28 (నినాదం న్యూస్) :** స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు, మాతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు. మండలం లోని కుర్మపల్లి శాఖ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతూ పేదల సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా సర్వేలు, ప్రజాభిప్రాయం పేరిట కాలయాపన చేస్తుందన్నారు.రాబోయే రోజులలో ప్రజా సమస్యలపై పోరాటాలలో ముందు ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది నూతన గ్రామ కార్యదర్శిగా పోలోజు బ్రహ్మచారి , చలి చీమల కోటేష్, సాయి, కార్యదర్శి దండేకర్ ఈశ్వర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వుడుగుంట్ల రాములు, మండల కమిటీ సభ్యులు వెంకటయ్య, అమృతాచారి, శ్రీకాంత్ ,మురళి ,వెంకటయ్య, రాజు, విఠల్,లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలేని ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు



**చింతపల్లి ,అక్టోబర్ 18( నినాదం న్యూస్)** మండలంలోని ఎరువుల దుకాణం దారులు కల్తీ ఎరువులను, విత్తనాలను గాని విక్రయించినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణి కుమారి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలలో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలలో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణంలో ఉన్న ఎరువుల వివరాలు ధరలను కచ్చితంగా బోర్డుపై రాసి ఉంచాలని ఆమె ఆదేశించారు. రైతులను మోసగించడానికి నాణ్యతలేని ఎరువులను గాని ,విత్తనాలను గాని, క్రిమిసంహారక మందులను గాని విక్రయించినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.రైతులు అధీకృత లైసెన్సు పొందిన డీలర్ల వద్దనే పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని ఆమె కోరారు.

# మూగజీవాల తరలింపు ముఠా అరెస్ట్

- మీడియా ముసుగులో మూగజీవుల అక్రమ రవాణా
- డీసీఎం వ్యాన్...కారు సీజ్
- అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- ఏటూరు నాగారం ఎస్ఐ తాజొద్దీన్





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ఎలాంటి అనుమతులు లేకుండా మూగ జీవాలను అక్రమంగా తరలిస్తున్నముఠాను ఏటూరు నాగారం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఎస్కార్ట్ వాహనంగా కారు అతివేగంగా వస్తుండడం దాని వెనకాల డీసీఎం వాహనం అతివేగంగా ఒకదాని వెనుక ఒకటి రావడంతో ఆ వాహనాలను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఎస్ఐ తాజొద్దీన్ తెలిపారు. ఈ మేరకు మీడియాతో ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీలో మూగజీవాల అక్రమ రవాణా వెలుగులోకి వచ్చిందని, ఈ ముఠాలో కన్నబోయిన శీను అనే వ్యక్తి ప్రధాన నిందితుడని తెలిపారు. రిపోర్టర్‌గా పనిచేస్తూ సెల్ షాప్ నిర్వహిస్తున్నాడని, గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా మూగ జీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు, రిపోర్టర్ ముసుగులో వాహనాలలో రాత్రిపూట మూగ జీవాలను తరలిస్తున్న క్రమంలో తన కారును ఎస్కార్ట్ వాహనంగా ముందు వెళ్తూ వాహనాలు దాటిస్తుంటాడని వివరించారు. పట్టుబడిన వారిలో మంగపేట మండలం కమలాపురంకు చెందిన ఆత్మారి రవీందర్, దొడ్ల కొత్తూరుకు చెందిన జైస్వాల్ కుమార్, జంగాలపల్లికి చెందిన కొడాలి కృష్ణ, ఉచిత శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న 22 మూగజీవాలను గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా చూస్తూ ఊరుకునేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు మూగజీవాలు, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యక్రమాలపై నిత్యం నిఘా ఏర్పాటు చేయడం జరిగింది వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలతొ పాటు ఏటూర్ నాగారం మండలంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చీకటి మాటున రాత్రులు కొంతమంది వ్యక్తులు అక్రమ సంపాదనకు అలవాటు పడి యూనిఫామ్ ధరించి ఇసుక లారీల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే సహించేది లేదని, చర్యలు తప్పవన్నారు. జల్సాలకు అక్రమ సంపాదనకు అలవాటు పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో మెరిసిన మాణిక్యం

- యువత జరుపుల సురేష్ ను ఆదర్శంగా తీసుకోవాలి
- చదవాలి... ఎదగాలి... సమాజాన్ని మార్చాలి.
- గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ సంస్థల కరస్పాండెంట్ జరుపుల కాలు నాయక్



**డోర్నకల్ /మరిపెడ అక్టోబర్ 18(నినాదం న్యూస్ ):** భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలంటే యువత కష్టపడి చదవాలని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ సంస్థల కరస్పాండెంట్ బీఆర్ఎస్ జిల్లా నాయకులు జరుపుల కాలు నాయక్ అన్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని బాల్య తండా గ్రామపంచాయతీ వాస్తవ్యులు జరుపుల సరోజ మంగ్య దంపతుల ద్వితీయ కుమారుడు జరుపుల సురేష్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ నీట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ పీహెచ్డీ ఆల్ ఇండియాలో 165 ర్యాంక్ సాధించినందుకు గాను గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ సంస్థల కరస్పాండెంట్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు జరుపుల కాలు నాయక్ స్వగృహం గ్రామస్తుల సమక్షంలో శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత ఎటువంటి చెడు అలవాట్లకు,మత్తు పానీయాలకు లోను కాకుండా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడానికి సురేష్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించి కన్న తల్లిదండ్రులకు పుట్టిన గ్రామానికి మంచి పేరును తీసుకోరావాలన్నారు. మారుమూల బాల్య తండా గ్రామపంచాయతీ పేరును ఇక్కడి యువతను అందరూ ఆదర్శంగా తీసుకునేలా ప్రాణాలికతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.జరుపుల సురేష్ మట్టిలో మెరిసిన మాణిక్యం అని మా బాల్య తండాలో పుట్టడం ఎంతో గర్వ కారణం అని అన్నారు.కష్టపడి చదివి భవిష్యత్తులో ఎదిగిన తర్వాత సమాజాన్ని మార్చే శక్తి యువతకు మాత్రమే ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బానోత్ హరినాయక్, బానోత్ పాప నాయక్,బానోత్ బాలు నాయక్,బోడ వెంకన్న,బానోతు హుస్సేన్,జరుపుల శంకర్,సోమని, మంగ్య,తండా యువకులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా విద్యాధికారి డాక్టర్ అప్పయ్య



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం న్యూస్):** వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. శుక్రవారం రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య , వైద్యాధికారులు ,పంచాయితీ కార్యదర్శి వైద్య సిబ్బందితో కలిసి జంగాలపెల్లిలోని బొడ్రాయి ప్రాంతం వీధిలో ఇండ్లను పరిసరాలను పర్యవేక్షించారు .పరిసరాల పరిశుభ్రత గురించి డిఎంహెచ్ఓ పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, దోమలు పెరిగే స్థావరాలు, నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీరు నిలిస్తే దోమ లార్వాలు తయారై జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంటుందన్నారు. ఏ జ్వరమైన ఒకటి రెండు రోజుల పాటు ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల వద్ద వైద్యం చేయించుకొని, ఒకవేళ జ్వర తీవ్రత తగ్గకపోతే జిల్లా ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు సులభతరమైన జీర్ణమయ్యే ఆహార పదార్థాలను, ఎక్కువ నీరును తీసుకోవాలని వివరించారు. జంగాలపల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాలలో 235 మందికి వైద్య చికిత్స చేసి అందులో పది మందికి జ్వరంతో బాధపడుతున్న వారికి డెంగ్యూ ,మలేరియా, ఆర్ డి టి టెస్టులు నిర్వహించారు. అలాగే 686 ఇండ్లను టీంల ద్వారా సందర్శించి 2,865 మందిని జనాభాను కవర్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ ,డాక్టర్ ప్రేమ్ సింగ్ ,డాక్టర్ రవళి, డాక్టర్ నవ్యరాణి ,డాక్టర్ దీప్తి ,డాక్టర్ నందకిషోర్ ,డాక్టర్ శ్రావణ్, డాక్టర్ నవ్య ,ఏఎంఓ దుర్గారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాంబయ్య, సూపర్వైజర్ దేవేందర్, వెంకన్న ,రాజయ్య ,హరినాథ్, రమ వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్లపై ఇసుక లారీలను ఆపితే కేసులు నమోదు చేయండి

- గంజాయి రవాణా, గుడుంబా తయారీకి అడ్డుకట్ట వేయాలి
- మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా పెంచాలి
- ములుగు జిల్లా ఎస్పి డా. శబరిష్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** రోడ్లపై ఇసుక లారీలను ఆపితే కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ అధికారులకు ఆదేశించారు.శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వెంకటాపురం పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్ లో రికార్డ్స్ ను పరిశీలించి కేసుల నమోదు వాటి స్థితి గతులను తెలుసుకున్నారు పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామాగ్రిని సిబ్బంది నైపుణ్యాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులపై ఇసుక లారీలు నిలుపుతున్నారని, వాటి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలా రోడ్లపై లారీలు ఆపితే కేసులు నమోదు చేయాలన్నారు. వెంకటాపురం పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు చత్తీస్‌ఘడ్ అంతరాష్ట్ర సరిహద్దును కలిగి ఉన్న క్రమంలో గంజాయి రవాణాపై ఎక్కువగా దృష్టి సారించాలని ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన అనంతరం వారికి వెంటనే రసీదు అందించాలని ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ఉద్యోగం అనేది భాద్యతతో కూడుకుందని క్రమశిక్షణతో ఉద్యోగం చేయాలని విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ కుమార్, ఎస్సై తిరుపతి రావు, ప్రొబేషనరీ ఎస్ఐ అంజినేయులు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు తడి చెత్త నిర్వహణ పై సాంకేతిక ప్రదర్శన

- హాజరుకానున్న మేయర్ శాసనసభ్యులు కలెక్టర్లు ప్రజాప్రతినిధులు

**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** బల్దియా ఆధ్వర్యం లో శనివారం లో ఉన్నారు అస్కి(అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) వారి సహకారం తో ఘన వ్యర్థాల (తడి చెత్త) నిర్వహణ పై సాంకేతిక ప్రదర్శన ( టెక్నలాజికల్ ఎక్స్ పో) ములుగు రోడ్డు సమీపం లో గల వెంకటేశ్వర గార్డెన్స్ లో నిర్వహిస్తున్నట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త ను ఎరువుగా మార్చడానికి వినియోగించే సాంకేతిక పద్దతులను వివరించడానికి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై రాష్ట్రాల నుండి 10 కంపెనీలు ఇట్టి ఎక్స్ పోలో పాల్గొని సాంకేతిక ను ఉపయోగించి తడి వ్యర్థాలను ఎరువు గా మార్చే పద్దతులను వివరిస్తారని నగర పరిధి లో బల్క్ వేస్ట్ జనరేటర్స్ (అంత్య వ్యర్థాల ఉత్పత్తిదారులు) అయిన హోటల్స్ ప్రభుత్వ, ప్రైవేటు హాస్టల్స్ , అపార్ట్మెంట్ అసోసియేషన్స్ ఫంక్షన్ హాల్స్ తదితర యజమాన్యాల కు చెందిన వారిని ఇందులో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నామని వారు ఉత్పత్తి చేసే అంత్య వ్యర్థాలను ఏవిధంగా అక్కడే మెన్యూర్ (ఎరువు)గా మార్చ వచ్చో అవగాహన పొందడానికి వారిని ఆహ్వానించడం జరుగుతుందని, తద్వారా నగరం లో ఉత్పత్తి అయ్యే తడి అంత్య ఉత్పన్నాలను గణనీయంగా తగ్గించడానికి ఇట్టి కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు.

## క్షయ వ్యాధి కట్టడి అందరి బాధ్యత



**నూతనకల్ అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** క్షయవ్యాధి బారినపడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిహెచ్ఓ చరణ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని శుక్రవారం నాడు టిక్యతండ గ్రామం లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు క్షయ వ్యాధి (టీబీ) పై అప్రమత్తంగా ఉండాలని ఈ వ్యాధి సోకిన వారు తుమ్మిన, దగ్గిన,ఉమ్మిన గాలి ద్వారా వేరే వారికి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈనాటి కార్యక్రమంలో మనిషా, కిరణ్, ఝాన్సీ, శాంతా, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు -ఎమ్మార్వో హిమబిందు




**కోదాడ (అనంతగిరి), అక్టోబర్ 18(నినాదం న్యూస్):** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అనంతగిరి తహసిల్దార్ హిమబిందు అన్నారు.శుక్రవారం అనంతగిరి మండల పరిధిలోని త్రిపురవరం గ్రామంలో ఐకెపి సెంటర్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులు తేమ లేకుండా ఐకెపి సెంటర్ కు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని ఈ సందర్భంగా వారు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,ఏఈఓ అన్వేష్,బుర్ర పుల్లారెడ్డి,కొత్తా నారాయణరెడ్డి, మందడి రంగారెడ్డి,గుర్రం వెంకటరెడ్డి,అనంతరెడ్డి,యేసు,జలీల, శ్రీదేవి,ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి -జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత



**కోదాడ,అక్టోబర్ 18(నినాదం న్యూస్):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధరతోపాటు 500 రూపాయల బోనస్ ను పొందాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లతా అన్నారు. శుక్రవారం బాలాజీ నగర్, గుడిబండ గ్రామల్లో ఆర్డీవో సూర్యనారాయణ, పిఏసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి లతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రం లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వాజిద్, మండల వ్యవసాయ అధికారి రజని,పిఏసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్లుగుండపునేని ప్రభాకర్ రావు, కమతం వెంకటయ్య,సోమ పంగు పార్వతి,శిరం శెట్టి వెంకటేశ్వర్లు, గోప్రా,సీఈఓ మంద వెంకటేశ్వర్లు , స్వామి నాయక్, వాల్యా, ఈర్ల నరసింహారెడ్డి,నవరత్నం రెడ్డి,హసన్ హలీ, వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి,రామకృష్ణారెడ్డి, రవి నాయక్, రాజు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మాధవరెడ్డి సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం



**కోదాడ,అక్టోబర్ 18(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యంతో చర్చలు జరిపి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోదాడకు చెందిన బి.యస్.ఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి కర్ల ప్రేమానంద్ శుక్రవారం మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు ఏళ్ల నుండి రూ.6వేల కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి కర్ల ప్రేమానంద్ కోరారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు శంభిపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సహకారం



**కొడంగల్ నినాదం :** 1996-98 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం రోజు బొంరాస్ పేట్ మండలం లోని నాగిరెడ్డి పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్, పెన్ను,నోటు పుస్తకం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే 50 మంది విద్యార్థులకు తమవంతు గా ఉడుతా భక్తిలా చిన్న సహకారం చేశామని, విద్యార్థులు కష్టపడి చదవి జీవిత లక్ష్యం చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి హరిలాల్, జిహెచ్ ఎం రవీంద్ర గౌడ్, ప్రధానోపాధ్యాయులు సాయిలయ్య,1996-98 బ్యాచ్ విద్యార్థుల బృందం వెంకటేష్ గౌడ్, మొయిస్ ఖాన్, కృష్ణ సతీష్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌నగర్ ధామ దీప్ బుద్ధ విహార్‌లో పూజా కార్యక్రమంలో సొంటిరెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం125 డివిజన్ అంబేద్కర్ నగర్ లోని ధామ దీప్ బుద్ధ విహార్ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా పున్నా రెడ్డి మాట్లాడుతూ బుద్ధం శరణం గచ్చామి అనే గౌతమ బుద్ధుడు సూచించిన విధానాలను నేటి తరం పాటించాలన్నారు. కోరికలను జయించిన వాడే మహా పురుషుడు అవుతారని బుద్ధుని బోధనలను అనుసరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సంతోష్ బాన్సువాడే , వైస్ ప్రెసిడెంట్ దండే రాజు , కమిటీ సభ్యులు అనిల్, రమేష్, సునీల్ , గణేష్, రాము, సంతోష్, సంజయ్ శివ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు

## ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- **ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్**



**చేవెళ్ల అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయక దాదాపు 7,500 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని అన్నారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా పెండింగ్లో ఉన్నటువంటి బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. డిగ్రీ మరియు పీజీ పూర్తయినటువంటి విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఒత్తిడికి గురి చేస్తున్న పట్టించుకోని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రభుత్వానికి విద్యారంగం పైన ఎంత చిత్తశుద్ధి ఉందో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ లోనే అవగతం అవుతుంది. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని చెప్పి ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది .లేనియెడల రాష్ట్రమంతా విద్యార్థులు అందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తోంది అన్నారు. ఈ సమావేశంలో కిషోర్, విజయ్, ప్రశాంత్, శివ కుమార్, అఖిల ,ప్రవళిక, సంధ్య ,పావని ,భాను తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గిరిబాబు

- **గిరిబాబును సత్కరించిన సాతాల గోపాల్**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రేపని గిరిబాబు ఎన్నికైనారు. ఈ సందర్భంగా అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు శాతాల గోపాల్ రేపని గిరిబాబును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిబాబును సత్కరించిన కార్యక్రమంలో సంపంగి వెంకటేష్ పాల్గొన్నారు.

## ఉషోదయ కాలనీలో శానిటేషన్ సిబ్బందితో పర్యటించిన కార్పొరేటర్

- **పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **సిబ్బందికి సూచించిన కార్పొరేటర్ రావుల శేషగిరి**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ పేస్ 2 లో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి శానిటేషన్ సిబ్బందితో కలిసి పర్యటించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచి పరిసరాలలో అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సిబ్బందికి సూచించారు.



ఈరోజు కొడంగల్ మున్సిపల్ పరిధిలోని మూడోవాడు యందు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు స్థానిక కౌన్సిలర్ శంకర్ నాయక్ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించడం జరిగింది ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలకు మా వంతుగా విద్యానందించి భవిష్యత్తులో ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రమాదేవి శివ శీను బొజ్జ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ సర్వేతో వికారాబాద్ అభివృద్ధికి మరింత అవకాశం

- **వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 నినాదం న్యూస్:** డ్రోన్ కెమెరాల సహాయంతో చేయబోయే మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే భవిష్యత్తులో వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని, సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. శుక్రవారం నాడు చైర్ పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ సర్వేకు కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు ప్రతి ఒక్కరు సహకరించాలని, మీ సహకారమే భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తును ఇస్తుందని అన్నారు. ఈసందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడు తూ.. కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 కింద వికారాబాద్ మున్సిపాలిటీలో మొట్టమొద టిసారి డ్రోన్ కెమెరాల సహాయంతో డిజిటల్ సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించడం చాలా సంతో షంగా ఉందని అన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ తో వికారాబాద్ మున్సిపల్ లో ఎక్కడ ఏమేమి ఉన్నాయో మొత్తం డిజిటలైజ్ చేయడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు ఎలాంటి సమస్యలు లేని మాస్టర్ ప్లాన్ అందించడం జరుగుతుందని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం జరగడం చాల సంతోషంగా ఉందని అన్నారు. మీ మీ వార్డులలో సర్వే చేయడానికి వచ్చిన డిటిసిపి అధికారులకు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, ఇన్చా ర్జి కమిషనర్ రాకేష్ రెడ్డి, డిటిసిపి అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మికులకు స్థలం కేటాయించండి

- **ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలో గతంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో అంతస్తుల భవనాలు, ఆర్టీసీ బస్సుల సందడి, ప్రయాణికులతో భవన నిర్మాణ కార్మికుల అడ్డ సందడిగా, కార్మికులు కనీసం నిలబడే స్థితిలో కూడా లేదని కార్మిక శాఖ అధికారులకు తెలిపారు. జగద్గిరిగుట్టలో పని చేస్తున్న సుమారు 500మంది భవన నిర్మాణ కార్మికులకు శాశ్వతమైన అడ్డాను చూపించాల్సిందిగా శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ ఉప కార్యదర్శి ఈ. గంగాధర్ కు అంజయ్య భవన్ లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత అడ్డాను ఏర్పాటు చెయ్యాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక వినతులు ఇచ్చామని నేటి వరకు అమలు కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నదని ఆ స్థలము అన్యక్రాంతం సత్వర చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. స్థలం ఉన్నపుడే తగిన నిర్ణయం తీసుకుంటే వందలాది కార్మికులకు సహాయం చేసిన వాళ్లు అవుతారని కార్మిక శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ కు స్థలం కేటాయింపు కొరకు ఉత్తరం రాస్తే స్థలం కేటాయిస్తారని సమస్యకు పరిష్కారములు లభిస్తుందని అధికారులకు అందించిన వినతి పత్రంలో వివరించారు.దీనికి కార్మిక శాఖ అధికారులు స్పందిస్తూ సంబందించిన శాకకు తెలియచేసి కార్మికుల సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చినట్లు యూసఫ్ ప్రకటన ద్వారా వివరించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్,ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రవి,రాము,సామెల్ తదితరులు పాల్గొన్నారు.

## పశుపోషణ చేస్తూ పాలమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం



**జవహర్ నగర్ అక్టోబర్ 18( నినాదం న్యూస్ ) :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంతోష్ నగర్ భద్రయ్య కాలనీలో ఉప్పల నారాయణ కుటుంబంతో సహా, ( 30) సంవత్సరాలనుండి జీవనం సాగిస్తున్నాడు.సర్వేనెంబర్ 417లో 37 గుంటల భూమి సుధ భద్రయ్య దగ్గర నుండి కొనుగోలు చేసినని తెలిపాడు,ఇట్టి భూమిలోవ్యవసాయం చేసుకుంటూ పశు పోషణ చేసుకుంటూ పాలమ్ముతు జీవనం కొనసాగిస్తున్నానడు, ఈ క్రమంలో ఉప్పల నారాయణపై కొందరు ల్యాండ్ మాఫియా కు పాల్పడ్డారని కొన్ని సోషల్ మీడియాలలో ప్రచారం చేస్తూ ల్యాండ్ ఫోటోలు తీస్తూ ప్రతినిత్యం వేధిస్తూ పోలీస్ కేసు పెడతామని భయపట్టిస్తూ ఉప్పల నారాయణ ను వేధిస్తున్నారు, మొన్న జరిగిన గొడవల్లో నాకు ఎలాంటి సంబంధం లేదని ఉప్పల నారాయణ మీడియా సమావేశం ముందు వాపోయారు.మాది రైతు కుటుంబమని వ్యవసాయమే మాకు జీవనాధారం అని రాజకీయాలు కబ్జాలు మాకు తెలవదని పశుపోషణ చేసుకుంటూ పాలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నామని ఉప్పల నారాయణ మీడియా ముందు తమ భాధ వెల్లబోసుకున్నారు. ఇటీవల ఒక విలేఖరి పై జరిగిన దాడిలో మాకు మా కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని మేము గత 15 రోజుల నుండి ఆసుపత్రిలో కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నామని మీడియా ముందు తెలిపారు. జరిగిన కొన్ని సంఘటనలో తన పాత్ర ఏమీ లేదని అనవసరంగా తన మీద నింద మోపుతున్నారని మీడియా ముందు తన ఆవేదన వెళ్ళగక్కారు.

## కొల్చారం మండలంలో ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు

- **రైతులు ధాన్యాన్ని సెంటర్‌కు తీసుకురండి సీఈవో సాయి రెడ్డి**



**కొల్చారం అక్టోబర్ 18( నినాదం న్యూస్) :** రైతులు దళారుల నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించవచ్చు అని అన్నారు. మెదక్ జిల్లా జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడు నాయిని జలాల్పూర్ పిఏసిఎస్ కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు ఈరోజు పిఎసిఎస్ సీఈవో సాయి రెడ్డి ఆధ్వర్యంలో లాంఛనంగా కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు రైతులకు ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రభుత్వం కేటాయించిన క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి 2320 బి గ్రేడ్ రకానికి 2300 రూపాయలుధరకే వరి ధాన్యం కొనుగోలు చేస్తామని కొనుగోలు కాదని 48 గంటల్లో రైతులకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది ఇతరుల దళారీల మాటలు నమ్మవద్దని ముఖ్యంగా సన్న రకం వడ్లకు 500 బోనస్ గా ప్రకటించడం వర్ణనాతీతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ గంపల లక్ష్మయ్య డైరెక్టర్లు శేషగిరి పాండరి మండల సీనియర్ నాయకులు రాయన్న వెంకట నరసింహులు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ మాజీ వార్డు మెంబర్ ఆగమయ్య ఏగొండ మల్లేశం బిజెపి నాయకులు దాసు నర్సింలు రైతులు కొమురయ్య పెంటప్ప శాఖయ్య తదితరులు పాల్గొన్నారు

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు



**కొడంగల్ నినాదం :** బీజాపూర్-హైదరాబాద్ 163జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను బొంరాస్ పేట్ పోలీసులు శుక్రవారం రోజు తుంకిమెట్లలో తనిఖీలు చేశారు. వాహనాలను ఆపి,వాహనం నంబర్ ను ఆన్లైన్లో పరిశీలించి, గతంలో పడిన చలాన్లు కట్టకుండా పెండింగులో ఉన్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించి, పెండింగ్ చలాన్లు కట్టించారు.చలాన్లు పెండింగ్ లో ఉంచరాదనీ, ఎప్పటికప్పుడు కట్టాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ఎలాంటి చలాన్లు ఉండవనీ, ప్రతి వాహనదారుడు తప్పకుండా రోడ్డు నిబంధనలైన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్,వంటివి కలిగి ఉండాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, అతివేగంతో ప్రయాణించరాదనీ, ఆన్ రోడ్ పార్కింగ్ చేయరాదని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**జవహర్ నగర్, అక్టోబర్ 18( నినాదం న్యూస్) :** 11కేవీ సాయిబాబా ఫీడర్ లో చెట్ల కొమ్మలను కత్తిరించడం, విద్యుత్ మెయింటనెన్స్ పనుల కారణంగా శనివారం సాయిబాబాఫీడర్ లోని మార్కెట్ రోడ్, సిల్వర్సీగల్లీ, ముత్తుస్వామికాలనీ, మోహన్ రావ్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, భక్తబాయికాలనీ, వీరభద్రకాలనీ, ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ, ఆనంద్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని. అదే విధంగా శివాజీనగర్ ఫీడర్ పరిధిలో సంతోష్ నగర్, శివాజీనగర్, సుక్కమ్మకుంట, విఘ్నేశ్వరకాలనీ, వీకే ఎన్ క్లేవ్, కళ్యాణ్ సులోచన గార్డెన్స్ ప్రాంతాల్లో 3గంటల నుంచి 4:30వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బాలాజీనగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావు తెలిపారు.

## ఎలక్ట్రికల్ స్కిల్ ట్రైనింగ్ ముగింపు

- **ఇన్‌చార్జ్ సీహెచ్ లక్ష్మీనరసింహులు**

**కోహెడ, అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** న్యాక్ భవన



నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కోహెడ మండల కేంద్రంలో నిర్వహించినటువంటి ఎలక్ట్రికల్ స్కిల్ ట్రైనింగ్ విజయవంతంగా ముగిసింది. ఇన్చార్జ్ సిహెచ్ లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో జరగబోయే ట్రైనింగ్ లేబర్ కార్డు ఉన్నటువంటి వాళ్లు వినియోగించుకోవలసిందిగా న్యాక్ ఇంచార్జి తెలిపారు. సుమారు వయసు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు వాళ్ళు అర్హులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాక్ సెంటర్ ఇన్చార్జ్ సిహెచ్ లక్ష్మీనరసింహులు ప్యాకాల్టి ఉమామహేశ్వర్,విద్యార్థులు టి అనిల్, వి శ్రీనివాస్ రెడ్డి, ఎం అనిల్, డి మహేందర్, ఎం శేఖర్, ఎం మహేందర్ రెడ్డి, జి రాజు, జె సతీష్, సిహెచ్ సతీష్, జె రమేష్, పి రమేష్,బాలరాజు, ఆంజనేయులు, శామిల్, శ్రీకాంత్, గణేష్, వేణు,శంకరయ్య, వెంకటయ్య, రంజిత్, ప్రశాంత్, పి రవి, సంజీవ్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

- **బతుకమ్మ, దసరా సందర్భంగా జీడిమెట్ల ఆర్టీసీ డిపో గ్రేటర్‌లోనే అత్యధిక రాబడి సాధించాం**
- **బస్ డిపో సిబ్బంది ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది**
- **జీడిమెట్ల డిపోకు 8 మెట్రో డీలక్స్ బస్సులు కేటాయింపు**
- **కండక్టర్ల కొరత ఎక్కువగా ఉంది**
- **జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులే నిజమైన దేవుళ్ళుగా భావిస్తామని అందుకు డ్రైవర్, కండక్టర్ల పాత్ర ఎంతో ప్రముఖమైనదని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ దసరా పండగలు అనంతరం వారి స్వగ్రామాల నుండి హైదరాబాద్ కు తిరిగి వచ్చే క్రమంలో అక్టోబర్ 14న విజయవాడ కరీంనగర్ నిజాంబాద్ ప్రాంతాలకు జీడిమెట్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులను నడిపి 35 వేల కిలోమీటర్లు నడుపవలసి ఉండగా 42,875 కిలోమీటర్ల మేరా బస్సులను తిప్పి ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థ నిర్ణయించిన ఒకరోజు రాబడి 12.33 లక్షల గాను 21.53 లక్షల ఆదాయం సాధించామన్నారు. అక్టోబర్ 15న వివిధ ప్రాంతాల నుండి హైదరాబాద్ కు ప్రయాణికులను తీసుకురావడంతో 16.21 లక్షల ఆదాయమును సాధించామని ఇది గ్రేటర్ హైదరాబాదులోని అన్ని డిపోల కన్నా అత్యధిక ఆదాయమును సాధించినట్లు పేర్కొన్నారు. ఈ రెండు రోజులలో ఆర్టీసీ నిర్ణయించిన ఆదాయం కన్నా 32 శాతం అధిక ఆదాయమును పొందినట్లు డిపో మేనేజర్ తెలిపారు. జీడిమెట్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ కండక్టర్లు, అధికారులు సిబ్బంది సహకారమే అధిక ఆదాయం సాధించుటకు ముఖ్య కారణంగా పేర్కొన్నారు. దసరా సందర్భంగా సాధించిన అత్యధిక ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణించిన మహిళల ద్వారా కాకుండా నగదు రూపంలో సాధించిన ఆదాయంగా వివరించారు.జీడిమెట్ల డిపోలో మొత్తం 120 బస్సులు ఉండగా ప్రస్తుతం నూతనంగా 8 మెట్రో డీలక్స్ బస్సులు కేటాయించారన్నారు. 120 బస్సులకు గాను 113 బస్సులు ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారం తిరుగుతున్నాయని, ప్రత్యేకంగా కేటాయించిన 8మెట్రో డీలక్స్ బస్సులను నాలుగు రూట్లలో నడిపిస్తున్నామన్నారు. మెట్రో డీలక్స్ బస్సులలో మహాలక్ష్మి పథకం, బస్సు పాసులు పొందిన వారికి ఉచిత ప్రయాణం ఉండదన్నారు. మెట్రో డీలక్స్ ఎనిమిది బస్సులలో 189 నెంబర్ తో రెండు బస్సులు అపురూప కాలనీ నుండి మెహదీపట్నం కు, మరో రెండు బస్సులు 9/272 నెంబర్ సి బి ఎస్ నుండి గండి మైసమ్మ వరకు, 83జె/272 నెంబర్ రెండు బస్సులను గండి మైసమ్మ నుండి కాచిగూడ వరకు, 18/272 గండి మైసమ్మ నుండి ఉప్పల్ వరకు మరో రెండు మెట్రో డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు డి ఎం తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో బాల్ నగర్ చౌరస్తా నుండి గాజులరామారంకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండడంతో విషయంను ప్రత్యక్షంగా పరిశీలించి ఈరోజు శుక్రవారం అక్టోబర్ 18 నుండి ప్రత్యేకంగా ఒక షటిల్ బస్సు ను ఏర్పాటు చేసినట్లు ఈ బస్సు బాల్ నగర్ చౌరస్తా నుండి గాజులరామారం వరకు షటిల్ బస్సు నడుస్తుందన్నారు.ప్రజల సౌకర్యార్థం గత 15 రోజుల క్రితం నుండి దుండిగల్ నుండి బాల్ నగర్ వరకు రెండు ప్రత్యేక సెటిల్ బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రజలు, ప్రయాణికుల అవసరాన్ని బట్టి అవసరమైన ప్రదేశాలలో మరి నీ సెటిల్ బస్సులు ఏర్పాటు చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అనేక ప్రాంతాలు, చౌరస్తాల వద్ద అత్యధిక ట్రాఫిక్ ఏర్పడడంతో బస్సులు సకాలంలో గమ్యస్థానాలకు చేరలేకపోతున్నాయని దీంతో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని ఆయన వివరించారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులు సంయమనం పాటించి ఆర్టీసీ సంస్థను, సిబ్బందిని అప్రతిష్ట పాలు చేయకుండా సహకరించాలన్నారు. డ్రైవర్ కండక్టర్లు కూడా బస్సులలో ప్రయాణించే ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా సహనంతో అప్పుడే ఆర్టీసీ సంస్థకు మరింత మంచి పేరు వస్తుందని సూచించారు. సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చవలసిన ఆర్టీసీ సంస్థలో డ్రైవర్ కండక్టర్లు సంయమనముతో ఉండి ప్రమాద రహితంగా యాక్సిడెంట్లు కాకుండా చూసుకొని అత్యధిక ఆదాయమును సాధించుటకు సహకరించాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా చేర్చుటకు డ్రైవర్ కండక్టర్లు స్నేహపూర్వకంగా, ప్రయాణికులతో మెదిలి సమస్త మొనగాడును మరింత పెంచుటకు సహకరించే డ్రైవర్ కండక్టర్లు, బస్సులను కండిషన్ లో ఉంచుటకు కావలసిన విధంగా కండిషన్లో ఉంచే మెకానికులను ప్రతినెల 25 మందిని ఎంపిక చేసి వారికి ప్రగతి చక్రం అవార్డులను అందజేస్తామన్నారు. ప్రగతి చక్రం అవార్డు పొందిన ఇతర సిబ్బందికి ప్రశంసా పత్రం తో పాటు ప్రత్యేక షీల్డ్ లను అందించి ప్రోత్సహిస్తామని అందుకు డ్రైవర్ కండక్టర్ లందరూ పోటీపడి ప్రమాదరహితంగా అధిక ఆదాయమును సాధించుటకు ముందుండాలని అటువంటి వారికి ఆర్టీసీ సంస్థ, అధికారులు అండగా ఉంటారని డిపో మేనేజర్ ఆంజనేయులు వివరించారు. ఆర్టీసీ యాజమాన్యం సూచనలను సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విధిగా పాటించాలన్నారు. ఆర్టీసీ మనుగడ మరింత కాలం కొనసాగాలంటే సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి మరింత బాధ్యతను పెంచుకొని సంస్థను కాపాడుకోవాలని జీడిమెట్ల ఆర్ టి సి డిపో మేనేజర్ ఆంజనేయులు వివరించారు. ప్రైవేట్ వద్దు, ఆర్టీసీ ముద్దు అనే నినాదం ప్రయాణికులందరూ మరింతగా ఆదరించే విధంగా డ్రైవర్ కండక్టర్ ల ప్రవర్తన, మాట తీరును మార్చుకొని ప్రయాణికులు ఆర్టీసీని మరింతగా ఆదరించే విధంగా మారాలని డ్రైవర్ కండక్టర్లు ఇతర ఉద్యోగులకు మేనేజర్ సూచించారు.

# గ్రూప్స్ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లాల్లో ప్రశ్నాపత్రాలను భద్రపరుచుటకు స్ట్రాంగ్ రూమ్‌లను వెంటనే గుర్తించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్ పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి



**జగిత్యాల, అక్టోబర్ 18(:నినాదం న్యూస్) :** జిల్లాలలో గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టం చేస్తూ సన్నద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్ల, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలలో చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని, ఈ ప్రక్రియ రేపటి లోగా పూర్తి చేయాలని కమిషన్ చైర్మన్ కలెక్టర్లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షిట్ల ముద్రణ ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో పరీక్ష ప్రశ్నా పత్రాల, ఇతర ముఖ్యమైన సామాగ్రి భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్ లను గుర్తించాలని అన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాలోని ఒక ప్రాంతంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు రీజనల్ కోఆర్డినేటర్లను నియమించాలని అన్నారు. గ్రూప్ 3 పరీక్షకు 3 పేపర్, గ్రూప్ 2 పరీక్ష 4 పేపర్లు పెద్ద ఎత్తున సభ్యులు ఉన్న నేపథ్యంలో రీజనల్ కోఆర్డినేటర్ పరిధిలో స్ట్రాంగ్ రూమ్ గుర్తించాలని అన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ పరిధిలో అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర స్ట్రాంగ్ రూమ్ ఉండాలని అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, పోలీస్ నోడల్ అధికారి, ఆర్డీఓ అందరూ సమన్వయం చేసుకుంటున్నారని, జిల్లాలో 34 సెంటర్లను గుర్తించడం జరిగిందని, జగిత్యాల జిల్లా నుండి సుమారు 11 వేల మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు, ఇందుకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ మధు సుధన్, ఏఎస్పీ భీమ్ రావు, కలెక్టరేట్ ఏ. ఓ. హన్మంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల సర్వే పక్కాగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్



**జగిత్యాల, అక్టోబర్ (నినాదం న్యూస్) :** ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధించిన అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున రాయికల్ మండలంలోని ప్రభుత్వ భూములను కలెక్టర్ జగిత్యాల ఆర్డీఓతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీఓ మధు సుధన్, రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కర్ర దేవరాజ్ మృతి పార్టీకి తీరని లోటు

- దేవరాజ్ మృతదేహానికి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే
- మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది : పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కర్ర దేవరాజ్ ఆకస్మిక మృతి టిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లారెడ్డిపల్లి లోని దేవరాజ్ నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. వీరి వెంట వీణవంక మండల మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేవరాజ్ ఆకస్మిక మృతి నన్ను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన మృతి ఆ కుటుంబంతో పాటు టిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఒక మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాజ్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. దేవరాజ్ కుటుంబానికి అండగా టిఆర్ఎస్ పార్టీ ఉంటుందని ఏ కష్టం వచ్చినా మీకు అండగా నేను ఉంటానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.

## ఎల్ఆర్ఎస్ ప్లాట్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్



**జగిత్యాల, అక్టోబర్ 18(నినాదం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని తులసి నగర్ లో జరుగుతున్న ప్లాట్ల క్రమబద్ధీకరణ సరళిని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శిఖం భూముల్లో లేని ప్లాట్ల ను, రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేని ప్లాట్లను రెగ్యులరైజ్ క్రమబద్ధీకరణ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, మధు సుదన్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, మున్సిపల్, రెవెన్యూ, అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలతో ఒరిగేదేమీ లేదు

- జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి



**జమ్మికుంట, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీల ఎంపిక కోసం గ్రామ కమిటీలు మున్సిపాలిటీ వార్డు కమిటీలు ఏర్పాటు చేసిన ప్రయోజనం కంటే ప్రజలకు నష్టాలు జరుగుతాయని జనతాదళ్ ( సెక్యులర్ ) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. శుక్రవారం ఆయన వీణవంక మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర రాష్ట్రంలోని ప్రజల స్థితిగతుల కు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే రిపోర్ట్ ల ఆధారంగా గ్రామసభలు మున్సిపాలిటీ వార్డు సభల ద్వారా నిజమైన అర్హులను ఎంపిక చేయవచ్చు కదా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ? ఇందిరమ్మ కమిటీల సభ్యులు అర్హులను గుర్తించడంలో విఫలమైతే దీనికి బాధ్యులు ఎవరని ప్రజల పక్షాన వాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక కంటే గ్రామ మున్సిపాలిటీ సభల ద్వారానే ఎంపిక చేస్తే అర్హులైన ప్రజలకు న్యాయం జరుగుతుందని ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వాసు వడ్లూరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు



**జమ్మికుంట అక్టోబర్18 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ దూర విద్యలో బి ఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలను ఈనెల 30 వరకు పొడగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్, కోఆర్డినేటర్ డాక్టర్ కె రాజేంద్రం లు తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న వారు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన సమాచారం కోసం 7382929775 సెల్ నంబర్ కు గాని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్ లో గాని సంప్రదించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- హుజురాబాద్ ఏడీఈ రాజేందర్

**జమ్మికుంట, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ తో పాటు మాచనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం 5గంటల వరకు మరమ్మతులు చేస్తున్నందువల్ల విద్యుత్ సరఫరా కి అంతరాయం కలుగుతుందని హుజురాబాద్ ఏ డి ఈ రాజేందర్ ప్రకటన లో తెలిపారు. దీనిలో భాగంగా కొత్తపల్లి, ధర్మారం, రామన్నపల్లి , మడిపల్లి, ఇల్లందకుంట, మోతుకులగూడెం, జమ్మికుంట ఇండస్ట్రియల్ నుండి బస్టాండ్ వరకు, మాచనపల్లి, ఇందిరానగర్, శాలపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఏడిఈ రాజేందర్ కోరారు.

## ఎంబీఏ విద్యార్థిని సమతకు ఎమ్మెల్యే చేయూత



**కరీంనగర్, అక్టోబర్ 18(నినాదం న్యూస్) :** తిమ్మాపూర్ మండలం బాలయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాయబ్ పల్లెకు చెందిన ఎంబీఏ విద్యార్థిని కామెర సమతకు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆర్థికంగా చేయూత నందించారు. నేతకాని సామాజికవర్గానికి చెందిన కామెర సంపత్ కుమార్తె సమతను కరీంనగర్ లోని నిగమా కళాశాలలో ఎంబీఏ చదివిస్తున్నాడు. అయితే ఫీజులు కట్టలేని పరిస్థితిలో కాలేజీ మానేసింది. కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం క్యాంపు కార్యాలయానికి పిలిపించి ప్రథమ సంవత్సరానికి సంబంధించిన ఫీజు మొత్తాన్ని చెక్ రూపంలో సమతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి , తిరుమల్ రెడ్డి, కొండల్ రెడ్డి, జి.రాజేందర్ రెడ్డి, టి.రాజేందర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, కొత్త తిరుపతిరెడ్డి, ఆసిఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధుపై స్పష్టత ఇవ్వాలి

- దళిత బంధు రెండో విడత నిధుల కోసం ప్రజా భవన్‌కు తరలిన దళితులు



**జమ్మికుంట, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** హైదరాబాద్ లోని ప్రజాదర్బార్ ప్రజాపాలన కార్యక్రమానికి రెండవ విడత దళిత బంధు నిధులు మంజూరు చేయాలనీ శుక్రవారం దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గం నుండి సుమారుగా 300మంది బాధితులు ప్రజా ధర్బార్ లో దరఖాస్తు చేయడం జరిగిందని దళిత బంధు సాధన సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 న జరగబోయే కాబినెట్ సమావేశం సమావేశంలో దళిత బందు పై స్పష్టమైన ప్రకటన చేయాలనీ డిమాండ్ చేయడం జరిగింది. గత 10 నెలలు గా అనేక కార్యక్రమాలు చేసిన ప్రభుత్వం స్పందించడం లేదని గత నెల 16 న ఖమ్మం జిల్లా చింతకాని లో దళిత బందు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా హుజురాబాద్ నియోజకవర్గం లోని దళిత కుటుంబాలకు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలని డిమాండ్ చేస్తున్నామని వార్తలు తెలిపారు.

శుక్రవారం క్యాబినెట్ మీటింగ్ లో ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి దళిత బందు రెండవ విడత నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలపాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులను ఏకం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పడం ఖాయమని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దళితబందు సాధన సమితి రాష్ట సభ్యులు కొగిలా మహేష్ పిచ్చయ్య హుజురాబాద్ సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేష్ కోలుగూరి నరేష్ ఇనుగాల బిక్షపతి అకినాపెల్లి ఆకాష్ మహంకాళి రమేష్ సరిగమ్ముల విజయ్ ఎల్కపల్లి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ

- కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో సరైన గుర్తింపు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**జమ్మికుంట, అక్టోబర్ 18 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం లోని నాగం పేట గ్రామంలో శుక్రవారం బిజెపి సభ్యత్వ నమోదుకు సంబంధించిన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి జమ్మికుంట మాజీ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రపంచంలో అతిపెద్ద సభ్యత్వ నమోదు చేసిన రాజకీయ పార్టీ కేవలం బిజెపి పార్టీ అని వారు తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వాల లో సంబంధించిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మొదటి స్థానం లో ఉందని వారు ఈ సందర్భంగా పేర్కొనడం జరిగింది. అందులో భాగంగా జమ్మికుంట మండలం కూడా ముందు వరుసలో ఉండాలని కార్యకర్తలకు ఉద్దేశించి వారు మాట్లాడారు. జమ్మికుంట మండలంలోని 20 గ్రామపంచాయతీ ల లో 38 బూత్ లలో ప్రతి బూత్ కు 200 చొప్పున సభ్యత్వాలు నమోదు చేయవలసిందిగా ముఖ్య కార్యకర్తలకు ఆదేశించడం జరిగింది. ఈనెల 24 తారీకు వరకు అనుకున్న సభ్యత్వం చేరువ కావాలని వారు పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యత మంట ఇన్చార్జి ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, మండల కన్వీనర్ పుల్లూరు ఈశ్వర్, యంగల లింగమూర్తి, రావుల సంపత్, కట్కూరి నరసింహారెడ్డి, నాగపురి విక్రమ్, నిమ్మల శంకర్, గాజుల తిరుపతి, కనబోయిన సమ్మయ్య, తోడి గణేష్, పుట్టాల మల్లేష్, గోవింద కొమురయ్య, మేడిపల్లి సమ్మయ్య, గుడ్ల రాజు మరియు అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు

## ఇందిరమ్మ కమిటీల పేరుతో పేద ప్రజలకు అన్యాయం చేయొద్దు

- శాలపల్లి - ఇందిరానగర్ ప్రజలకు అండగా ఉంటా
- సీపీఐ నియోజకవర్గ యువ నాయకుడు కోడిగూటి ప్రవీణ్



**జమ్మికుంట, అక్టోబర్ 18( నినాదం న్యూస్) :** అర్హులైన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లలో కాంగ్రెస్ కార్యకర్తలు కాని, బిఆర్ఎస్ నాయకులు కానీ ఇందిరమ్మ కమిటీల పేరుతో అన్యాయం చేస్తే సహించేది లేదని సిపిఐ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ యువ నాయకుడు కోడిగూటి ప్రవీణ్ హెచ్చరించారు.. హుజురాబాద్ మండలంలోని ఇంద్రానగర్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాలపల్లి - ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంటి స్థలం ఉండి గుడిసెలు, రేకుల షెడ్డు ఉన్న నిరుపేద కుటుంబాలకు న్యాయబద్ధంగా వారికి ఇందిరమ్మ ఇండ్లు రావాలని అలా కాకుండా కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ పేరుతో వారికి అన్యాయం చేస్తే సహించేది లేదని అలా ఏ పార్టీ నాయకులు చేసిన వారికి భవిష్యత్తులో ప్రజలు బుద్ధి చెప్తారని వారికి అండగా ఉంటానని ఈ సందర్భంగా హెచ్చరించారు..

## పాఠశాల స్థాయిలోనే నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



**వెల్గటూర్, అక్టోబర్18(నినాదం న్యూస్):** విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని పాఠాలే కాదు ఇతర రంగాల లో కూడా పట్టు సాధించాలని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తొమ్మిది, పది తరగతుల తమ పాఠశాల విద్యార్థులతో కలిసి వృత్తి విద్య, రిటైల్ కోర్స్ లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాంబే షాపింగ్ మాల్ ను సందర్శించారు. మాల్ నిర్వహణ, వ్యాపార మెలకువలు, వినియోగ దారులతో మెలిగే విధానం, రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలతో పాటు, సమకాలీన వ్యాపార, ప్రైవేట్ రంగాల పై కూడా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఇలాంటి సందర్శనలు ఉపయోగ పడతాయని ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్, వృత్తి విద్యా అధ్యాపకులు నూతి రవీందర్ తెలిపారు.

## నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసిన సీసీఐ బ్రాంచ్ మేనేజర్

- సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకోవాలి
- దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దు
- వరంగల్ సీసీఐ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ ఎస్ దావే



**జమ్మికుంట, అక్టోబర్ 18 ( నినాదం న్యూస్) :** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి పరిధిలో సీసీఐ కి నోటిఫైడ్ చేసి కేటాయించన జిన్నింగ్ మిల్లులను శుక్రవారం వరంగల్ సీసీఐ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ ఎస్ దావే, జమ్మికుంట సీసీఐ సెంటర్ ఇంచార్జి చంద్రశేఖర్ కలిసి జిన్నింగ్ మిల్లులను సందర్శించారు.. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్లుల యందు వెబ్రిడ్జి, ఫైర్ ఫైటింగ్ ఈక్వప్ మెంట్, ఇన్సూరెన్స్, అన్నీ సక్రమంగా ఉన్నాయా అని తనిఖీ చేసి సంబంధిత మిల్లులలో మార్కెటింగ్ శాఖ వారిచే సాఫ్ట్ వెర్ ఇన్స్టాలేషన్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చే ఏడు జిన్నింగ్ మిల్లులు నోటిఫైడ్ చేశారా అని పర్శీలించారు.. ఈ సందర్భంగా సీసీఐ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ ఎస్ దావే మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని ఇంటి వద్దనే ఎండ బెట్టి, శుభ్రపరిచి తేమ శాతం 8% నుండి 12% వచ్చే విధంగా ఉండాలి అని సూచించారు... సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుక వచ్చే రైతులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా దార్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ తో అనుసంధానం చేసిన బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ తో అనుసంధానం ఉన్న సెల్ ని ఓటీపీ కోసం తప్పకుండ తీసుకొని రావాలని కోరారు.. అతి త్వరలో సీసీఐ సెంటర్ కొనుగోలు కేంద్రాలని ప్రారంభిస్తామని తెలిపారు.. వారి వెంట మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తా

- ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 18(నినాదం న్యూస్) :** పట్టభద్రుల సంక్షేమమే తన ప్రధాన కర్తవ్యమని మరియు యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తను రానున్నటువంటి కరీంనగర్ అదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టబద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో బరిలో ఉంటున్నానని వారు అలుగునూర్, తిమ్మాపూర్ మరియు ఎల్ఎండి కాలనీ లోని వివిధ విద్యాసంస్థలను సందర్శించిన భాగంగా నిర్వహించినటువంటి ముఖాముఖిలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులకు అన్ని రంగాలలో ప్రాధాన్యం వచ్చే విధంగా కృషి చేస్తానని మరియు పోటీ పరీక్షల సందర్భంగా అండగా ఉండి వారికి సముచిత స్థానం కల్పించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి గొప్ప వారిదిగా ఉంటానని తెలుపుతూ, రానున్నటువంటి పట్టబద్రుల ఎన్నికలలో అతి కీలకమైనటువంటి ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని నిబద్ధత మరియు అంకిత భావం కలిగిన తనకు ఎన్నికలలో తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సమావేశాలలో సంబంధిత విద్యా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## 20న కొత్తపల్లిలో అలయ్ బలయ్

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణ రావు



**కరీంనగర్, అక్టోబర్ 18(నినాదం న్యూస్) :** తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఈనెల 20న అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలిపారు. శుక్రవారం రోజున బిఆర్ఎస్ అధ్యక్షులు రామకృష్ణ రావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు, చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ నెల 20న ఆదివారం రోజున అలై బలై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీష్ రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణారావు, వివిధ మండలాల మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## మేక పాలు తాగితే..

నిపుణుల ప్రకారం.. మేక పాలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆవు పాలు మాదిరిగానే మేక పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. పోషకగుణాలు అధికంగా ఉండే ఈ పాలను తాగడం వల్ల పలు ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చునని చెబుతున్నారు.



ప్రొటీన్స్, కాల్షియం ఎక్కువగా ఉండే మేక పాలను తాగడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. మేక పాలల్లో అమినోయాసిడ్స్ పుష్కలంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అన్ని సక్రమంగా అందుతాయి. ఇది ఆవు పాల కంటే ఎక్కువ ప్రొటీన్, అవసరమైన విటమిన్లు, తక్కువ లాక్టోస్ కలిగి ఉంటుంది, దీని కారణంగా ఇది సులభంగా జీర్ణమవుతుంది.


ఒక కప్పు మేక పాలు తీసుకోవడం వల్ల 30 శాతం ఫాటీ ఆమ్లాలను శరీరం అధికంగా పొందుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. మేక పాలలో ఉండే బయోఆర్గానికి సోడియం శరీరానికి చాలా మేలు చేస్తుంది. కణాల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. మేక పాలు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది. ప్రతిరోజు మేకపాలు తాగడం వల్ల రక్తపోటు నియంత్రిస్తుంది. మేక పాలను తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది.

డెంగ్యూ సోకిన వారికి రక్తంలో ప్లేట్ లేట్స్ తగ్గిపోతుంటాయి. వారికి మేక పాలు ఇస్తే మంచి ఫలితం ఉంటుందని చెబుతారు. కానీ, డెంగ్యూ చికిత్సతో దీనికి ఎటువంటి సంబంధం లేదు. ఇది ఒక పోషకమైన ఎంపిక, శరీరానికి అవసరమైన పోషణను అందించగలదని నిపుణులు అంటున్నారు, అయితే ఇది ప్లేట్‌లెట్లను పెంచడంలో లేదా డెంగ్యూ వైరస్ ప్రభావాన్ని నేరుగా నియంత్రించడంలో సహాయపడదు.

డెంగ్యూ అనేది డెంగ్యూ వైరస్ వల్ల కలిగే వైరల్ ఇన్ఫెక్షన్. డెంగీ దోమ కుట్టడం వల్ల ఇది వ్యాపిస్తుంది. ఇక.. ఈ దోమ కుట్టిన తర్వాత విపరీతమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూకి ఉత్తమ చికిత్స ఫ్లూయిడ్ థెరపీ అని నిపుణులు అంటున్నారు, రోగి వీలైనంత ఎక్కువ ద్రవాన్ని తీసుకోవాలి, ORS తీసుకోవాలి, ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఈ సమయంలో విశ్రాంతి తీసుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.

## పసుపు రంగును తొలగించే హెూం రెమెడీస్..

**ఇలా చేస్తే మెరిసిపోతాయ్..!**



పసుపు పళ్లను శుభ్రం చేయడానికి, మీరు దంతవైద్యుని వద్దకు వెళ్లి దంతాలను శుభ్రం చేసుకోవచ్చు. కానీ ప్రతిసారీ దంతవైద్యుని వద్దకు వెళ్లడం సాధ్యం కాదు.కాబట్టి కొన్ని హెూం రెమెడీస్ చేయడం ద్వారా దంతాల పసుపు రంగును తొలగించుకోవచ్చు.

పసుపు పళ్లను శుభ్రం చేయడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించవచ్చు. ఒక కప్పు నీటిలో రెండు టీస్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ మిక్స్ చేసి మౌత్ వాష్ చేయండి. ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని నోటిలో వేసుకుని బ్రష్ చేసి మింగాలి. అయితే దీన్ని చేసే ముందు వైద్యుడిని సంప్రదించండి.పసుపు పళ్ళు శుభ్రం చేయడానికి మరొక చిట్కా కూడా ఉంది. మీరు నిమ్మ, నారింజ, అరటి తొక్కను కూడా ఉపయోగించవచ్చు. ఇది మీ దంతాల మీద ఏర్పడిన పసుపు ఫలకాన్ని క్లియర్ చేయడంలో సహాయపడుతుంది.డి-లిమోనెన్, లేదా సిట్రిక్ యాసిడ్, పై తొక్కలోని సమ్మేళనం మీ దంతాలను తెల్లగా మార్చడంలో సహాయపడుతుంది. మీ దంతాలను శుభ్రం చేయడానికి ఈ తొక్కను మీ దంతాల మీద 2 నిమిషాల పాటు సున్నితంగా రుద్దండి.పసుపును బ్రష్‌పై అప్లై చేసి 2 నిమిషాలు బ్రష్ చేయండి. ఇది మీ దంతాలకు కూడా మేలు చేస్తుంది. బ్రష్‌ల గురించి కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం, మీరు మీ టూత్ బ్రష్‌ను ప్రతి 3 నెలలకు మార్చాలి.

## TB రోగులకు శుభవార్త.. కొత్త ఎక్స్‌రే పరికరం సృష్టి..

**ఇంటి దగ్గరే పరీక్షించుకునే అవకాశం**



ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR) TB వ్యాధిని గుర్తించడానికి కొత్త హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే పరికరాన్ని అభివృద్ధి చేసింది. ఈ పరికరం సహాయంతో తక్కువ సమయంలో సులభంగా TB వ్యాధిని పరీక్షించవచ్చు.


ఈ ఎక్స్-రే యంత్రం ప్రయోజనం ఏమిటంటే.. ఇక నుంచి ఎవరైనా సరే ఉందా లేదా అని పరీక్షించుకోవడానికి ఎక్కడో ఉన్న ఆసుపత్రికి వెళ్లవలసిన అవసరం లేదు. కొత్త పరికరం సహాయంతో ఇంటి దగ్గర కూడా వ్యాధిని సులభంగా పరీక్షించవచ్చు. టీబీని గుర్తించేందుకు కొత్త హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే పరికరాన్ని అభివృద్ధి చేశామని.. ఇది వ్యాధిని ముందుగానే గుర్తిస్తుందని 19వ అంతర్జాతీయ ఔషధ నియంత్రణ అధికారుల (ICDRA) ఇండియా-2024లో ICMR డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహ్లా తెలిపారు.

వాస్తవానికి ఈ హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే యంత్రాలు చాలా ఎక్కువ ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి. ఈ విషయాన్నీ దృష్టిలో పెట్టుకుని ఐఐటీ కాన్పూర్ ఐసిఎంఆర్ భాగస్వామ్యంతో ఎక్స్-రేను అభివృద్ధి చేసిందని డాక్టర్ రాజీవ్ బహ్లా చెప్పారు. దేశీయంగా తయారు చేయబడిన ఈ హ్యాండ్‌హెల్డ్ ఎక్స్-రే, హ్యాండ్‌హెల్డ్ ధరలో సగం కంటే తక్కువ ఖర్చు అవుతుందని చెప్పారు. భారతదేశం కూడా MPOX కోసం మూడు టెస్టింగ్ కిట్‌లను అభివృద్ధి చేసిందని డాక్టర్ బహ్లా చెప్పారు. MPOX కోసం మూడు టెస్టింగ్ కిట్‌లను అభివృద్ధి చేశామని, మూడు కంపెనీలు అలాంటి కిట్‌లను తయారు చేస్తున్నాయని చెప్పారు.

# ఈ తప్పులు కీళ్ల నొప్పులకు దారి తీస్తాయ్

అవని

వయసు పెరిగే కొద్దీ కీళ్ల నొప్పులు సర్వసాధారణం. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కీళ్ళు, కండరాలలో నొప్పి సంభవిస్తుంది. ఇదేకాకుండా కీళ్ల నొప్పులకు అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి.ఎముకలు బలహీనపడటం, యూరిక్ యాసిడ్ పెరగడం, ఆర్థరైటిస్, బలమైనా గాయాలు మొదలైనవి ఉన్నాయి. గతంలో వృద్ధాప్యానికి కీళ్ల నొప్పులు కారణమని చెప్పేవారు. అయితే నేటి రోజుల్లో ఆర్థరైటిస్ సమస్యలు చిన్న వయసులోనే కనిపిస్తున్నాయి. దీనికి చాలా కారణాలు ఉండవచ్చు.



### తప్పుడు ఆహారం తీసుకోవడం




విటమిన్ డి, కాల్షియం, మెగ్నీషియం శరీరంలోని ఎముకలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించే పోషకాలు. కాల్షియం లోపాన్ని అందించే ఆహారాన్ని తీసుకోకపోతే ఎముకలు బలహీనపడతాయి. దీనివల్ల మీరు చిన్న వయసులోనే కీళ్ల నొప్పుల బారిన పడవచ్చు. కాబట్టి గుడ్లు, ఎండు చేపలు, పాలు, ఇతర పాల ఉత్పత్తులు, ధాన్యాలు మొదలైనవి మీ ఆహారంలో తప్పక చేర్చుకోవాలి. అలాగే కండరాల నొప్పులను నివారించడానికి ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

### గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం



మీరు పని చేస్తున్నప్పుడు లేదా ఫోన్ ఉపయోగిస్తున్నప్పుడు లేదా టీవీ చూస్తున్నప్పుడు ఒకే భంగిమలో గంటల తరబడి కూర్చుంటే భుజం కీళ్లు, మోకాలు, మెడ, వెనుక కండరాలలో నొప్పి వస్తుంది. కాబట్టి కనీసం ప్రతి 40 నిమిషాలకు విరామం తీసుకోవాలి. లైట్ స్ట్రెచింగ్ లేదా వాకింగ్ చేయాలి.



### బరువు నియంత్రణలో ఉండాలి

మీరు బరువు పెరుగుతున్నట్లయితే, సమయంపై దృష్టి పెట్టాలి. లేదంటే తర్వాత చాలా కష్టం అవుతుంది. స్థూలకాయం, మధుమేహం, గుండె జబ్బులు మొదలైన వాటి ప్రమాదాన్ని పెంచడమే కాకుండా కీళ్లపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది శరీరంలో అవయవాల నొప్పి సమస్యను కలిగించవచ్చు.

### అనారోగ్యకరమైన ఆహారాలు

కొంతమందికి అన్నీ తెలిసినప్పటికీ అనారోగ్యకరమైన ఆహారాన్ని తింటూనే ఉంటారు. ఇది అనేక వ్యాధులకు దారి తీస్తుంది. ఉదాహరణకు శరీరంలో యూరిక్ యాసిడ్ పరిమాణం పెరిగిన తర్వాత, ఈ లక్షణాలు ఆర్థరైటిస్‌గా మారవచ్చు. దీని వల్ల చిన్న వయసులోనే కీళ్ల నొప్పుల సమస్య రావచ్చు. కాబట్టి ఆహారం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.

### వ్యాయామం చేయకపోవడం



యోగా, జాగింగ్, సైక్లింగ్, లైట్ స్ట్రెచింగ్ వంటి ఏదైనా శారీరక శ్రమను రోజువారీ దినచర్యలో చేర్చుకోవాలి. ఎందుకంటే ఆధునిక జీవనశైలిలో ఆహారం సరైనది కాదు. దీని కారణంగా మీ శరీరం సరైన కదలికలు సంభవించవు. దీంతో కీళ్ల నొప్పులు, కండరాలు బిగుసుకుపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వ్యాయామం లేకపోవడం వల్ల అనేక ఇతర శారీరక సమస్యలు కూడా పెరుగుతాయి.

నినాదం మార్కెట్ NINADAM MARKET

# దీపావళికి ముందు ఉచిత సిలిండర్లు..

## ఆ ప్రభుత్వం కీలక నిర్ణయం



దీపావళి పండుగ దగ్గర పడుతోంది. ఈ సందర్భంగా ఇంటి వద్ద వంటలు తయారు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఉచిత ఎల్‌పిజి సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీపావళికి ముందే కర్వా చౌత్, అహెూయి అష్టమి వంటి పండుగలు రానున్నందున నిరుపేద కుటుంబాలకు మరింత సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది యూపీ ప్రభుత్వం.

దీపావళి సందర్భంగా రాష్ట్రంలోని 1.86 కోట్ల కుటుంబాలకు ఇచ్చిన హామీలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నెరవేర్చనుంది. ఈ కానుకకు రూ. 1,890 కోట్లు కేటాయించారు. 'డబుల్ ఇంజిన్ గవర్నమెంట్' అనే ఈ చొరవ కింద ఉచిత సిలిండర్లు అందజేస్తామని హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చే పని ప్రారంభించామని యూపీ ప్రభుత్వంప్రకటన విడుదల చేసింది.

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద హెూలీ, దీపావళి పండుగల సందర్భంగా రాష్ట్రంలో రెండేళ్ల పాటు ఉచిత ఎల్‌పిజి సిలిండర్లను పంపిణీ చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు త్వరితగతిన పంపిణీ పూర్తి చేసే బాధ్యతను ఫుడ్ అండ్ లాజిస్టిక్స్ శాఖ చేపట్టింది.

ఉచిత సిలిండర్ పొందాలంటే ఏం చేయాలి?

మహిళలు ప్రత్యేకంగా ఈ ఉచిత సిలిండర్‌ను పొందడానికి వేచి ఉన్నారు. ఇప్పుడు ఈ నిరీక్షణకు తెరపడనుంది. ఈ పథకం కింద ఆధార్ పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఆధార్ ప్రామాణీకరణ పూర్తయిన వారికి దీపావళి లోపు ఉచిత సిలిండర్ పొందడానికి మార్గం ఉంటుంది. బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానించి చెల్లుబాటు అయ్యే లబ్ధిదారులకు మాత్రమే ఈ ఉచిత సిలిండర్ అందుబాటులో ఉంటుంది.

**గతేడాది కూడా ప్రభుత్వం ఉచితంగా సిలిండర్ల పంపిణీ:**

గతేడాది ఇక్కడ ప్రభుత్వం 85 లక్షల మంది మహిళలతో సహా 1.85 కోట్ల కుటుంబాలకు ఉచితంగా ఎల్‌పిజి సిలిండర్లను పంపిణీ చేసింది. ఇక్కడ 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 842.42. ఈ సిలిండర్ ధర సెప్టెంబర్ నాటికి ఉంది. ఉజ్వల పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

## సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదుకు లిమిట్..

**లేకుంటే ఐటీ నోటీసులు తప్పదు**



ఇటీవల కాలంలో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ కంపల్సరీ అయిపోయింది. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే.. ఖాతాదారుడికి ఖచ్చితంగా ఆధార్, పాన్ కార్డు ఉండి తీరాలి. అలా అయితేనే బ్యాంక్‌లో ఖాతా తెరుస్తున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల్లో వివిధ రకాలు ఉన్నాయి. సేవింగ్ అకౌంట్, కరెంట్ అకౌంట్, శాలరీ అకౌంట్ తదితర రకాలున్నాయి. కానీ చాలా మంది సేవింగ్ అకౌంట్‌లనే ఓపెన్ చేస్తారు.

అత్యధిక శాతం ఖాతాదారులు.. తాము సంపాదించిన నగదును ఈ ఖాతాల్లోనే పొదుపు చేస్తుంటారు. ఈ సేవింగ్ అకౌంట్లలో నగదు భద్రపరచడమే కాకుండా.. దీనిపై వడ్డీని సైతం పొందవచ్చు. మరికొన్ని సమయాల్లో.. ఇతరుల నగదును తమ ఖాతాల ద్వారా ఖాతాదారుడు లావాదేవీలు జరుపుతుంటాడు. అలాంటి వేళ సేవింగ్ అకౌంట్ పరిమితి దాటుతుంది. అసలు సేవింగ్ అకౌంట్‌లో లిమిట్ ఎంత ఉండాలి.

## మణప్పురం ఫైనాన్స్‌కు భారీ షాక్..

ప్రముఖ గోల్డ్ లోన్ సంస్థ మణప్పురం ఫైనాన్స్ షేర్లలో నేడు (అక్టోబర్ 18న) భారీ పతనం కనిపించింది. ఈ క్రమంలో ఒక దశలో BSEలో ఈ షేరు 16.85 శాతం క్షీణించి రూ. 147.50 కనిష్ట స్థాయికి చేరుకుంది. గత 11 నెలల్లో ఈ స్టాక్ ఇంత తక్కువకు చేరుకోవడం ఇదే మొదటిసారి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మణప్పురం అనుబంధ సంస్థ అయిన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్‌కు రుణాలు ఇవ్వకుండా నిలిపివేయడం వల్ల మణప్పురం ఫైనాన్స్ షేర్లు భారీగా పడిపోయాయి.రుణగ్రహీతల నుంచి అధిక వడ్డీ వసూలు చేయడంతో బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ ఈ చర్య తీసుకుంది. ఇప్పటికే ప్రాసెస్‌లో ఉన్న లావాదేవీలను పూర్తి చేసిన తర్వాత అక్టోబర్ 21 నుంచి ఈ కంపెనీపై పరిమితి అమల్లోకి వస్తుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

వీరికి కూడా రుణాలు ఇవ్వొద్దు

ఇదే సమయంలో ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్‌తో పాటు, ఆరోహన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ నవీ ఫిన్‌సర్వ్‌లపై కూడా RBI ఇదే విధమైన పరిమితులను విధించింది. ఈ కంపెనీలు ఇప్పటికే ఉన్న రుణాలకు సేవలను కొనసాగించుకోవచ్చు. కానీ కొత్త రుణాలపై మాత్రం పరిమితులు విధించారు. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో ఈ కంపెనీల వ్యాపార వృద్ధి, ఆదాయాలపై ప్రభావం చూపనుంది. మణప్పురం ఫైనాన్స్‌కు అనుబంధంగా ఉన్న ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులలో నాలుగింట ఒక వంతు వాటాను అందజేస్తుందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఒక నోట్‌లో పేర్కొంది.

టార్గెట్ తగ్గింపు

ఆర్బీఐ నుంచి ఈ నివేదిక వచ్చిన తర్వాత మోర్గాన్ స్టాన్లీ ఈ స్టాక్ విలువను తగ్గించింది. ఈ నేపథ్యంలో షేర్ టార్గెట్ ధరను రూ.170కి తగ్గించింది. లపై చర్యలు లాభాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని బ్రోకరేజ్ తెలిపింది. ఈ నేపథ్యంలో FY25 కోసం కంపెనీ ఏకాభిప్రాయ ఆదాయ అంచనాలను 20 శాతం నుంచి FY26-27 కోసం 30 శాతానికి తగ్గించింది. ఆదాయాల అంచనాలను తగ్గించినప్పటికీ వాల్యుయేషన్లు చౌకగా ఉన్నాయని బ్రోకరేజ్ సంస్థ చెబుతోంది. దీంతో ఈ స్టాక్‌పై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరగడానికి మరికొంత సమయం పట్టవచ్చని అంచనా వేసింది.

ఆదేశాలు జారీ

వెయిటెడ్ యావరేజ్ లెండింగ్ రేట్ , నిధుల వ్యయంతో సహా కంపెనీ ధరల విధానాన్ని పరిశీలించిన తర్వాత ఆశీర్వాద్




మైక్రోఫైనాన్స్ రుణ వ్యాపారాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు RBI తెలిపింది. అక్టోబర్ 17, 2024 నాటి ఆర్డర్‌లో అక్టోబర్ 21న వ్యాపారం ముగిసిన తర్వాత రుణ మంజూరు లేదా పంపిణీని నిలిపివేయాలని కంపెనీకి ముఖ్యమైన అనుబంధ సంస్థ అయిన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ లిమిటెడ్ ని RBI ఆదేశించిందని మణప్పురం ఫైనాన్స్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.

## భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

**-అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**



**పెద్దపల్లి రూరల్,అక్టోబర్18 (నినాదం న్యూస్):** ఎలిగేడు మండలంలో పెండింగ్ ఉన్న భూ,సమస్యల పరిష్కారానికి పొగడ్బందీ చర్యలు తీసుకోవాలని, అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. మండల కేంద్రంలోని శుక్రవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మండలంలోని పెండింగ్లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకొని,భూ సమస్యల పరిష్కారానికి చర్యలు సుకోవాల్సిన సూచనలు చేశారు. మీసేవా కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సకాలంలో వాటిని జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ తనీఖీల్లో తహసిల్దార్ బషీరుద్దిన్, నాయబ్ తహసిల్దార్ కిరణ్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆరు కోర్సులు.. 172 సీట్లు

- పెద్దపల్లి, రామగుండం ఐటిఐలలో ఏటిసి కేంద్రాలు
- అడ్మిషన్లకు అక్టోబర్ 30 గడువు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్18( నినాదం):** పెద్దపల్లి జిల్లాలోని ఐటిఐ లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష తెలిపారు. కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏటీసీ వివరాలు వెల్లడించారు. జిల్లాలో రెండు ఏ.టి.సి కేంద్రాలు మొదటి దశలో మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో చోట 6 కోర్సులలో 172 సీట్లు ఉంటాయన్నారు. ప్రవేశాలు ప్రారంభ మయ్యాయని, అక్టోబర్ 30 వరకు చివరి గడువు ఉందని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులకు ఏటీసీ కోర్సులకు అర్హులని తెలిపారు. ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందన్నారు.జిల్లాలో ఏడాది కాలపరిమితి గల మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులలో 40 సీట్లు ఉన్నాయన్నారు. రెండు సంవత్సరాల కాల పరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ పర్చుయల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్సుడ్ సి.ఎన్.సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామన్నారు. ఐటీఐ పెద్దపల్లి లోని ఏటిసి కేంద్రంలో 172 సీట్లకు 110 పైగా సీట్లు ఇప్పటి వరకు భర్తీ జరిగాయని, రామగుండం ఏటీసీ కేంద్రంలో 35 సీట్లు మాత్రమే నిండాయని చెప్పారు. యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులలో జాయిన్ అయ్యేందుకు అడ్మిషన్ కోసం iti.telangana.gov.in ఆన్ లైన్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో (పదవ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టిసి, ఆధార్ కార్డ్) పెద్దపల్లి ఐటిఐ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు.ఏ.టి.సి భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కోర్సులకు సంబంధించిన పరికరాలు జిల్లాకు చేరాయన్నారు. సెలవు దినాల్లోనూ అడ్మిషన్స్ స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి తిరుపతి, పెద్దపల్లి, రామగుండం ఐటిఐ ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడవాలి


**మంథని అక్టోబర్ 18( నినాదం న్యూస్):** యువత సన్మార్గంలో నడవాలని మంథని సీఐ రాజు గౌడ్ అన్నారు. బుధవారం ముత్తారం మండల కేంద్రంలో దర్యాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనే



లక్ష్యంగా యువత పని చేయాలని కోరారు. నేటి తరంలో విద్యార్థులు సరదాలు,సెల్ఫోన్లకు,మందుకు డ్రగ్స్ కు అలవాటై తమ విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని అన్నారు. ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పిల్లలు చదువులో వెనుకబడడం, పరీక్షలు సరిగా రాయకపోవడం,ఒంటరిగా ఉండడం,ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మీకు తెలియని ఏదైనా ఫోన్ నెంబర్ నుండి కాల్స్ కానీ మెసేజ్ కానీ మిమ్మల్ని ఏమైనా ప్రలోభాలకు గురిచేసిన వెంటనే1930 నెంబర్ కు కాల్ చేసి పోలీసు వారి సహాయం పొందాలన్నారు.వాట్సాప్ డీపీలో తమ ఫోటోలు పెట్టుకోకూడదని వాటి వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించారు .ఎవరైనా ఆకతాయిలు మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మరియు కళాశాల చుట్టుపక్కఆవరణలో ఎవరైనా మద్యం సేవించినట్లయితే వెంటనే 100 కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోపతి నరేష్,కానిస్టేబుల్ రమేష్, హొంగార్డ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రూప్ పరీక్షల ప్రశ్నా పత్రాలకు భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

**ఆసిఫాబాద్ అక్టోబర్ 18(నినాదం న్యూస్ ):** త్వరలో జరగనున్న గ్రూప్-2, 3 పరీక్షల సంబంధిత ప్రశ్నాపత్రాల ను భద్రపరిచేందుకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయడం



జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసేందుకు స్ట్రాంగ్ రూమ్ లు జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్. పి. ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్ 15, 16, గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, పరీక్షల సంబంధిత ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

# శాంతి సందేశమే ఏసుక్రీస్తు జీవిత చరిత్ర

- మతం అనేది మానవత్వంతో కూడిన అంశం
- రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క






**బెల్లంపల్లి అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** ప్రపంచ శాంతి కోసమే ఏసుక్రీస్తు జన్మించారని,మతం అనేది మానవత్వంతో కూడిన అంశం అని రాష్ట్ర పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం కల్వరి చర్చి ఆధ్వర్యంలో 50రోజుల ఉపవాస ముగింపు ప్రార్ధనలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు 50రోజులుగా క్రైస్తవ సోదరులు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు చేపట్టారని వారి కోరికలు నెరవేరాలని అన్నారు.ప్రతీ ఒక్కరు ఎంతో నిష్టతో ఈ దీక్షలు చేపడతారని అన్నారు.పాస్టర్ ప్రవీణ్,సిస్టర్ షారోన్ ప్రజలకు చేసే సేవలను కొనియాడారు.రాజ్యాంగంలో అంబేద్కర్ రాసినట్టుగా ఎవరి స్వేచ్ఛ,మతం వారిదే అని అన్నారు.పాస్టర్ ప్రవీణ్ అవమానాలు,భయం,ఆయనను కిడ్నాప్ చేసి బెదిరించినా తన స్వంత ఊరుని కాదనక వెళ్లిపోయి,మళ్లీ తన ఊరు కోసం,తన ప్రజల కోసం సేవ చేయడానికి ఇక్కడికి వచ్చాడని,ప్రజల సేవే పరమావధిగా ఆయన ప్రార్ధనలలో నిమగ్నమై ఉంటున్నాడని అన్నారు.ముందుగా 50రోజుల ఉపవాస దీక్షల గురించి పాస్టర్ ప్రవీణ్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.యేసక్రీస్తు చరిత్ర,ప్రార్ధన వలన కలిగే ఉపోద్ఘాతం,కీర్తనల రూపంలో క్రైస్తవ భక్తులకు వివరించారు.తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్ర ప్రదేశ్,తమిళనాడు,కర్ణాటక,కేరళ,ఛత్తీస్ గడ్,ఒరిస్సా,మహారాష్ట్రాల నుండి క్రైస్తవ భక్తులు ముగింపు సభకు లక్షల మంది హాజరై సభకు హాజరై దేవుని కృపకు పాత్రులయ్యారు.సభలు జాతీయ రహదారి ఆనుకొని ఉండడంతో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు,జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే వాహనాల నుండి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్,ఎమ్మెల్సీ దండే విఠల్,మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల్ చారి,మున్సిపల్ చైర్మెన్ జక్కుల శ్వేత,డిసిపి భాస్కర్,ఏసిపి రవికుమార్ సిఐ లు దేవయ్య,శశిధర్ రెడ్డి,డి మోహన్,ఎస్ఐ లు ప్రవీణ్ కుమార్,రాజశేఖర్, నాయకులు సూరిబాబు,రవి,కారుకూరి రాంచందర్, నాతరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి దసరా మేళాలను విజయవంతం చేయండి

**పెద్దపల్లి జిల్లా అడక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య**



**సుల్తానాబాద్, అక్టోబర్ 18(నినాదం న్యూస్):** ఈ నెల 20న హైదరాబాదులో నిర్వహించే పద్మ శాలి దసరా మేళా ఆత్మీయ సమ్మేళనం విజయ వంతం చేయాలని పద్మశాలి సేవా సంఘం జిల్లా అడాక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చలో హైదరాబాద్ ఎల్బీనగర్ లో నిర్వహించే దసరా మేళ పోస్టర్లు ను స్థానిక పద్మశాలి సంఘం నేతలతో కలిసి ఆ విష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీల అందరిని ఏక తాటిపైకి తీసుకువచ్చి రానున్న రోజుల్లో పద్మశా లీలు అన్ని రంగాలలో రాణించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీల ను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి అలై బలై ఆత్మీయ సమ్మేళనం కా ర్యక్రమాన్ని, పున్న గణేష్ నేత,ప్రధాన కార్యద ర్శి గడ్డం లక్ష్మీనారాయణ, దసరా మేలా చైర్మన్ కౌ కుంట్ల రవితేజ,ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్ర మాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. ప్రతి ఒక్క పద్మశాలి ని చైతన్య పరిచేందుకే ఈ వేదిక కార్యక్రమమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం జిల్లా అడక్ కమిటీ మెం బర్ పెగడ చందు, పద్మశాలి నేతలు కొండ సత్య నారాయణ, పెగడ పరుశ రాములు, కామణి రాజేంద్రప్రసాద్,వలస భాస్కర్,సతీష్, పెగడ ఐ లయ్య,ఇప్పకాయల నారాయణ,గుడ్ల సత్య నారాయణ,నల్ల రాజేశం,దూడం సతీష్, వెంగళ అంజయ్య, లతోపాటు పెద్ద సంఖ్యలో పద్మశాలి కుల బంధువులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించినప్పుడే ఏకాగ్రత, పట్టుదల పెంపొందుతాయి

- ఐపీఎస్ అధినేతలు మాటేటి కృష్ణప్రియ, సంజీవ్‌కుమార్




**సుల్తానాబాద్,అక్టోబర్ 18(నినాదం న్యూస్):** క్రీడల్లో రాణించినప్పుడే ఏకాగ్రత,పట్టుదల పెం పొందుతాయని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చై ర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రియా అన్నారు.సుల్తానాబాద్ పట్టణంలోని ప్ర భుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన 68 వ పాఠశాలల పెద్దపల్లి జిల్లా స్థాయి అండర్ 14, 17 బాల బాలికల వాలీబాల్ క్రీడా పోటీలలో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.ఈ సంద ర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమా ర్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ విద్యార్థు లు క్రీడల్లో రాణించినప్పుడే చదువులో ఏకాగ్రత పట్టుదల పెంపొందుతాయని,పెద్దపల్లి జిల్లా స్థా యి వాలీబాల్ అండర్ 14 బాలికల విభాగంలో డి ప్రియదర్శిని, కే లాస్య, ఖుషి,14 సంవత్సరా ల బాలుర విభాగంలో ఏ అద్వైత్, ఎం అక్షిత్, సుశాంత్, 17 సంవత్సరాల విభాగంలో నిఖిల్, లిఖిత మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, క్రీడల వల్ల శరీరానికి కావలసిన వ్యాయామం, ఆరోగ్యం దృఢంగా ఏర్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యులు సత్యం, ఇక్బాల్, శివ,సతీష్ పాల్గొన్నా రు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

- ఏబివిపి అధ్వర్యంలో ధర్నా
- పేద విద్యార్థులకు న్యాయం చేయాలి
- ఏబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్



**పెద్దపల్లి,అక్టోబర్ 18(నినాదం న్యూస్):** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ తక్షణమే విడుదల చేసి,పేద విద్యార్థులను ఆదుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్ దగ్గర రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈసందర్భంగా ఏబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయంబర్స్మెంట్,స్కాలర్షిప్ లు దాదాపు రూ,7800 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని,వివిధ కళాశాలలో చదువుతున్న పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది విద్యార్థులు విద్య కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని,మరోవైపు తెలంగాణలో నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు.కనీసం విద్యాశాఖ మంత్రి లేకపోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి కి విద్యారంగం మీద ఉన్న చిత్త శుద్ధి అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు.ఈ ప్రభుత్వంతో విద్యార్థులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు స్కాలర్షిప్ లు రాని కారణంగా కళశాలల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికేట్ ఇవ్వక పోవడంతో పై చదువులకు వెళ్ళలేక విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు.గత కొన్ని రోజులుగా ప్రవేటు యాజమాన్యం రోడ్డెక్కి ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తున్నా,ఈ ప్రభుత్వానికీ సోయి లేకుండా పోయిందన్నారు. విద్యార్థులకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని,అలాగే పెండింగ్ లో ఉన్న రూ,7800 కోట్లు స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయకపోతే సెక్రటేరియట్ ముట్టడిస్తామని ఏ బీవీపీ అధ్వర్యంలో హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీపతి సాయి తేజ, అజయ్,%ాఖీూ% జిల్లా కన్వీనర్ ఓమేష్, %ాఖీణ% జిల్లా కన్వీనర్ రిషి,నగర కార్యదర్శులు అరవింద్,వంశీ నాయకులు సందీప్,గణేష్, విక్రాంత్ దినేష్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘం చైర్మన్ నుంచి గ్రంథాలయ సంస్థ చైర్మన్ వరకు...

- పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా అన్నయ్య



**సుల్తానాబాద్, అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా సుల్తానాబాద్ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నేత అంతటి అన్నయ్య గౌడ్ ను ప్రభుత్వం ని యమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి. వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జా రీ చేశారు. ఎన్ఎస్యూఐ కార్యకర్త గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన అన్నయ్య గౌడ్ 1986 లో ప్రభుత్వం అప్పుడు ప్రజాస్వామ్య యుతంగా ని ర్వహించిన సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి చైర్మన్ గా ఎన్ఎస్యూ ఐ ప్యానల్ నుం డి ఎన్నికయ్యారు.1988లో జూనియర్ కాలేజ్ విద్యార్థి సంఘం చైర్మన్గా తర్వాత పట్టణ, మం డల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత పిసిసి అధ్యక్షుడు మహే ష్ కుమార్ గౌడ్ గతంలో ఎన్ఎస్యు ఐ రాష్ట్ర అ ధ్యక్షునిగా ఉన్నప్పు డు ఆయన కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. జాతీయ ఎన్ఎస్ యూ ఐ కార్యవర్గ సభ్యునిగా సేవలందించారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎన్నికైనారు.మండ ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, ఉమ్మడి డిసిసి లో వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం సేవలందించారు .తదుపరి అన్నయ్య గౌడ్, పుష్పలత దంపతు లు చెరోసారి రెండు పర్యాయాలు సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కొనసాగా రు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా వ్యవహరించి గుర్తింపు తెచ్చుకు న్నారు. మొదటినుండి పార్టీ నిర్ణయించిన ఎంపీ పీ, సర్పంచులు, జడ్పిటిసి లు, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి ఎంతగానో కృషి చేశారు. తాజాగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా తన నియామకానికి సహకరించిన గౌరవ సీఎం రేవంత్ రెడ్డి, గౌరవ డిప్యూటీ సీఎం బట్టి విక్రమా ర్క, గౌరవ మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొ న్నం ప్రభాకర్ గౌడ్, గౌరవ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, గౌరవ ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణా రావు, ఠాకూర్ మక్కాన్ సింగ్ కు,నాయకులకు, ప్రతీ కార్యకర్తకు అన్నయ్య గౌడ్ కృతజ్ఞతలు తె లిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పెద్దపల్లి, అక్టోబర్ 18(నినాదం న్యూస్):** సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా శనివారం రంగంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో పెద్దపల్లి, రంగంపల్లీ,చందపల్లి, నిట్టూర్, నిమ్మనపల్లి, పెద్ద బొంకూర్,పెద్దకల్వల గ్రామాలలో ఉదయం 09:00నుండి 11:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించగలరని ఆ ప్రకటనలో కోరారు.


## న్యాక్ అధికారులకు సన్మానం



**మంథని అక్టోబర్ 18( నినాదం న్యూస్):** ముత్తారం మండలం ఓడెడ్ గ్రామంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతుల పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు తిరుణహరి రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ పొందిన 75మంది యువతీ యువకులతో కలిసి శిక్షణ ఇచ్చిన న్యాక్ అధికారులు రాములు,శ్రీనివాస్ లను శాలువా తో ఘనంగా సత్కరించారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు తిరుణహరి రాజు మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా పలు రంగాల్లో శిక్షణ పొందిన కార్మికులందరూ శిక్షణ కాలంలో నేర్చుకున్న మెలకువలతో మరింత వృద్ధిలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కొలని కుమారస్వామి,ఉపాధ్యక్షులు నరెడ్ల సంపత్, గ్రామ కన్వీనర్లు సాయి కుమార్,శ్రీనివాస్ మరియు శిక్షణ పొందిన కార్మికులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్-18( నినాదం, న్యూస్):** పెద్దపల్లిలోని మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ డివిజన్ కార్యాలయాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాగునీటి నాణ్యతను పరీక్షించే లాబోరేటరీని, పరీక్షల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన



మార్గదర్శకాల ప్రకారం నాణ్యత పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీనివాస్ ఉన్నారు. జిల్లాలో పిల్లల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్ లో సమగ్ర పిల్లల సంరక్షణ పథకం అమలు పై శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అనాథ పిల్లలను గుర్తించాలన్నారు. సిసిఐ హోమ్లలో అనాథ పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించే విధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ తెలిపారు. పదో తరగతి పాసైన పిల్లలకు అడ్వాన్సుడ్ ట్రైనింగ్ కేంద్రాలలో వివిధ కోర్సులలో శిక్షణ అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, డిసిపిఓ కమలాకర్, జిల్లా కోఆర్డినేటర్ అరుణ, ఎఫ్.ఆర్.ఓ స్వర్ణలత పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**బెల్లంపల్లి అక్టోబర్ 18 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని చాకేపల్లి గ్రామ పంచాయతీలో ప్రాథ మిక వ్యవసాయ సహ కార సంఘం ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రా న్ని బెల్లంపల్లి నియోజక



వర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లు సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు మండలంలోని రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు.మండలంలో ఎన్నో సంవత్సరాలుగా వడ్ల కొనుగోలు కేంద్రాలు లేక మండల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని,గిట్టుబాటు ధరలు లభించక వారు పడ్డ ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యచరణ రూపొందించింది అని తెలిపారు.రైతులకు వడ్ల కొలుగోలుపై రైతులకు ఎలాంటి ఇబ్బందలు కలగకుండా ఉండాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా రుణమాఫీ కానీ రైతులకు,2లక్షలకు పైగా ఉన్న రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేపడుతుందని సూచించారు.ప్రభుత్వ అధికారులు,ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం

- ప్రణాళిక ప్రకారం ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తాం
- మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో

మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 నినాదం న్యూస్:** మార్పల్లి మార్కెట్ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా మార్పల్లి మండలం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర శాసన మండలి చీఫ్ వీఫ్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రైతు రుణ మాఫీ, ఆరు గ్యారంటీ ల స్కీంలను ప్రతి ఒక్కరికి అందించడం ప్రభుత్వ లక్ష్య మన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చేయగలుగుతున్నమ్మన్నారు. మార్కెట్ కమిటీకి ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని, ప్రభుత్వానికి, మార్కెట్ కు, రైతులకు మంచి పేరు వచ్చేలాగా మార్కెట్ కమిటీ కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి రైతులకు సేవ చేసే అవకాశం నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చిందని, నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యతగా పనిచేసి రైతులకు సేవ చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, రైతాంగానికి చేయాల్సిన అన్ని పనులను తమ ప్రభుత్వం అందజేస్తుందని, రైతుల రుణమాఫీలో వేల కోట్ల రూపాయలు రుణమాఫీ జమ చేయడం జరిగిందని, ఇంకా రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ నిధులను వారి అకౌంట్లో జమ చేస్తామని తెలిపారు. అదే విధంగా 2 లక్షలు కన్నా పైన రుణాలు తీసుకున్న వారికి కూడా ప్రణాళిక ప్రకారం ఎవరెవరికి ఎప్పుడు రుణమాఫీ నిధులు జమ చేయాలో ముందే తెలియజేస్తామని మంత్రి తెలిపారు .పంటల భీమా, రైతు భరోసా సైతం తమ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం, ఇందిరమ్మ ఆరు గ్యారెంటీలతోపాటు, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామ న్నారు. భవిష్యత్తులో ఆయిల్ ఫామ్ తోటలకు మంచి డిమాండ్ ఉందని, జిల్లాలో ఈ సంవత్సరం ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేయాలనీ , అయిల్ పాం పంట వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని, అంతర పంటలు సాగు చేసుకుని లాభం పొందవచ్చు అని, ప్రభుత్వం ఎకరాకు 50 వేల రూపాయల సబ్సిడీ సైతం ఇస్తుందని మంత్రి తెలిపారు. బ్యాంకు తప్పులను సరిచేసి 4 లక్షల మందికి ఈ నెలాకరు వరకు రైతు రుణమాఫీ చేస్తామన్నారు. రైతుల ను అభివ్రుది లోకి తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు, కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల, తాండూరు, పరిగి నియోజకవర్గ శాసనసభ్యులు కాలే యాదయ్య, బి మనోహర్ రెడ్డి, టి.రాంమోహన్ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన వై. మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ జి మల్లేశ్ యాదవ్, మరియు పాలకవర్గ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



**జగిత్యాల, అక్టోబర్ 18(నినాదం న్యూస్):** పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల సంస్మరణ లో భాగంగా ఈనెల 21న పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమంలో స్మృతి పరేడ్ నిర్వహించి అమర వీరుల త్యాగానికి నివాళులు అర్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్స వం పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21 నుండి జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31వ (తేది :21-10- 2024 నుండి 31 -10 -2024) వరకు కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలల్లో, కళాశాలలో ఆన్లైన్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థుల కు పోలీసులు వినియోగించే ఆయుధాలు, చేయు విధులు, అత్యవసర పరిస్థితుల్లో చేయవలసిన అంశాలపై, పోలీసులు చేసిన ప్రతిభ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం. ఆఫ్లైన్ ద్వారా ప్రతి పోలీస్ స్టేషన్లో మండల ల వారీగా విద్యార్థులను పోలీస్ స్టేషన్కు ఆహ్వానించి పోలీస్ స్టేషన్ నిర్వహణపై అవగాహనను కల్పిం చడం జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఆన్లైన్‌లో https://forms.gle/ bYgaoMWk 7CLJyVn 58 ఈ వెబ్ సైట్ ద్వారా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించడం జరుగు తుంది. వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అభ్యర్థులు పాల్గొనవచ్చున్నారు. కేటగిరి-1: స్టూడెంట్స్‌కు ఇంటర్మీడియట్ వరకు(విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడక Judicious usage of mobile phones) (My role on making Telangana a drug free State ,తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర) అనే అంశాల మీద విద్యార్థులకు ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు నిర్వర్తించడం జరుగుతుంది ఆన్లైన్లో 28 అక్టోబర్ 2024 వరకు సమర్పించవచ్చును. ప్రతిభ కనబరిచిన ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని అన్నారు.జిల్లా పరిధిలో విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు మించకుండా షార్ట్ వీడియో లను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఫోటోలు, వీడియోలు ఈనెల తేది: 20-10-24 లోపు సంబంధిత పోలీస్ స్టేషన్లలో అందించాలి. రక్తదాన శిబిర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో, పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందం తో పాటల కార్యక్రమాలు నిర్వహించడం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిదిలోని ప్రధాన కూడళ్ళ వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పి వెల్లడించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులపై రాక్షసంగా వ్యవహరిస్తుంది

**జిఓ 29 నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది - స్వయంగా నేనే అశోక్ నగర్ వెళ్తా - కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**




**కరీంనగర్, అక్టోబర్ 18(నినాదం న్యూస్):** గ్రూప్ 1అభ్యర్థులపై విశక్షణ రైతంగా లాఠీ ఛార్జ్ చేయడం సిగ్గుమాలిన చర్య ఎంపి కార్యాలయం లో ఏర్పాటు, చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర హెూం శాఖ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, షాపులలో వున్నా వారిపై సైతం లాఠీ ఛార్జి చేయడం ప్రభుత్వం దుర్మార్గగంగా వ్యవరిస్తుంది తప్పు,ఒప్పులు వాటిని సరి చేసి ఎగ్జామ్స్ రేషెడ్యూల్ చేయాలి గత ప్రభుత్వం కి ఈ ప్రభుత్వనికి తేడా ఏంది నిరుద్యోగ భృతి ఏది, కేసిఆర్ ఆలోచనకు అనుగుణంగా మేదులుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం 29జివో ఇచ్చింది నోటిఫికేషనన్స్ రద్దు చేయడానికే 39లక్షల మంది పొట్టకొట్టిన కేసిఆర్ బిఆర్ఎస్ నిరుద్యోగుల పట్ల మాట్లాడే హక్కు లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేసిమని విద్యార్థులు బాధపడుచున్నారు. అవసరం ఐతే నేనే అశోక్ నగర్ వెళ్లుతా నిరుద్యోగులు తల్చుకుంటే ప్రభుత్వాలు తరుమారు అయినవి బిజెపి నిరుద్యోగులకు మద్దతూ ఉంటుంది, మా పార్టీ నాయకులను అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి మూసి విషయంలో పిపి ఇచ్చిన కేటిఆర్ ఆరోజు కేసిఆర్ లక్ష యాభై వేల కోట్లు ముంచిండు సుందరికరణ పేరిట కాంగ్రెస్ అసెంబ్లీలో చెప్పింది, మేము దానికి వ్యతిరేకం కాదు, కాని లక్ష యాభై వేల కోట్లు ఖర్చు పెట్టె దానికి మేము వ్యతిరేకం. 11వేల కుటుంబాలను కాపాడాలని కోరుకుంటున్నాను ఎవరైతే స్టాంప్ డ్యూటీ తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకొన్నా తరువాత ఇల్లు కట్టుకొన్న వారిని, చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి కోరారు.

హైడ్రా పేరుతో ప్రజలను బయపెడుతున్న ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ కొంత మంది నాయకులు రేవంత్ వ్యవరిస్తున్న తీరును వేచి చూస్తున్నారు జాగ్రత్త అని సిఎంకు హెచ్చరిక చేశారు.అరు గ్యారంటీలు పేరుతో 420 హామీలు ఇచ్చి మోసం చేస్తున్న ప్రభుత్వమని ద్యాయబట్టరు. ఈ విలేకరుల సమావేశంలో చెన్నమనేని వికాస్ రావు, మాజీ మేయర్‌డి శంకర్, కార్పొరేటర్స్ పెద్దపల్లి జితేందర్, దుర్శెటి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ దేవరకొండ తాజా చిత్రం


## కేరళలో షూటింగ్ పూర్తి



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'వీడీ 12' ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల కేరళలో ఓ షెడ్యూల్ పూర్తయింది. దీనిని ఉద్దేశించి విజయ్ ఫ్యాన్స్ మీట్‌లో మాట్లాడారు. ప్రకృతి అందాల మధ్య షూట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కేరళలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిం చినట్లు తెలిపారు. ఈ చిత్రం తనకెంతో ప్రత్యేకమన్నారు. ఇది అందరి మనసులకు దగ్గరవుతుందని.. మంచి జ్ఞాపకాల్నిస్తుందన్నారు. 'వీడీ 12' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇటీవల దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలు లీక్ కాగా.. నిర్మాణ సంస్థ స్పందించింది. 'డియర్ రౌడీ ఫ్యాన్స్.. మీకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు టీమ్ ఎంతో కష్టపడుతోంది. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. లీక్ అయిన ఫొటోను షేర్ చేయొద్దు' అని విజ్ఞప్తి చేసింది. ఇందులో విజయ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. మళ్లీ రౌడీ హీరో విజయ్ దేవరకొండను పవర్‌ఫుల్‌గా చూడనున్నారని నిర్మాత ఓ సందర్భంలో అన్నారు. వచ్చే ఏడాది మార్చి28న ఈ సినిమా విడుదల కానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రానున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. 'విధి పిలిచింది.. రక్తపాతం ఎదురుచూస్తోంది.. కొత్త రాజు ఉద్భవిస్తాడు' అంటూ టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తి పెంచిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కేరళలో విజయ్ ఫ్యాన్స్ మీట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# రోలెక్స్ పాత్ర ఆధారంగా మూవీ

## హీరో సూర్య ఆసక్తికర విషయం వెల్లడి



కమల్ హాసన్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' చిత్రంలో సూర్య పోషించిన 'రోలెక్స్'పాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మాదకద్రవ్యాల గ్యాంగ్‌లీడర్‌గా సినిమా క్లైమాక్స్‌లో ఆయన పండించిన విలనిజం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. రోలెక్స్ పాత్రను ఆధారంగా చేసుకొని ఒక పూర్తిస్థాయి సినిమాను తెరకెక్కిస్తానని లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. ఈనేపథ్యంలోనే 'కంగువా' ప్రమోషన్స్‌లో 'రోలెక్స్' మూవీ గురించి సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను నటించిన ఓ సినిమాతో దీనికి సంబంధం ఉంటుందన్నారు. '1986లో విడుదలైన 'విక్రమ్'తో 2022లో వచ్చిన 'విక్రమ్'కు ఏవిధంగా లింక్ ఉందో అదేవిధంగా 'రోలెక్స్'కూ నేను నటించిన ఒక సినిమాతో కనెక్షన్ ఉంటుంది' అని తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ సినిమా ఏమై ఉంటుందా? అని 'ఎక్స్' వేదికగా పలువురు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. సూర్య నటించిన తాజా చిత్రం 'కంగువా'. శివ దర్శకుడు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇందులో సూర్య మూడు విభిన్న లుక్స్‌లో కనిపించనున్నారని సమాచారం. దిశాపటానీ కథానాయిక. బాబీ దేవోల్ కీలకపాత్ర పోషించారు. పీరియాడిక్ యాక్షన్ జానర్‌లో ఇప్పటివరకు తెరపైకి రాని ఓ కొత్త కాన్సెప్ట్‌లో దీనిని చిత్రీకరించినట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దాదాపు రూ.2000 కోట్లు వసూలుచేస్తుందని నిర్మాత ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ముంబయిలో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు సూర్య. సినిమా విశేషాలు, కొత్త ప్రాజెక్ట్ వివరాలు వెల్లడించారు. ఇందులో భాగంగానే 'రోలెక్స్' గురించి మాట్లాడారు.లోకేశ్ కనగరాజ్ ప్రస్తుతం 'కూలీ' పనుల్లో బిజీగా ఉన్నారు. రజనీకాంత్ హీరోగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమా తర్వాత తాను ఎల్‌సీయూ హీరోలందరితో కలిసి అదిరిపోయే మూవీ చేయాలనుకుంటున్నానని ఇటీవల చెప్పారు. 'విక్రమ్'ని అద్భుతంగా పూర్తి చేసేందుకు 'రోలెక్స్' సీన్స్ క్రియేట్ చేశా. ఆ పాత్రకు వచ్చిన క్రేజ్ దృష్టిలోఉంచుకొని 'రోలెక్స్'పై ఒక స్టాండలోన్ మూవీ చేయాలనుకుంటున్నా.

# అర్థం చేసుకునే.. ఓ మంచి భర్త కావలెను

## నటి శృతి హాసన్ తన పార్టనర్‌పై ఆసక్తికర పోస్ట్



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే నటి శ్రుతిహాసన్ తన సినిమా అప్‌డేట్‌లతో పాటు వ్యక్తిగత విషయాలను పంచుకుంటుంటారు. సోషల్ మీడియాతో పాటు వరుస ఇంటర్వ్యూల్లోనూ సందడి చేస్తుంటారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పారు. ఆదర్శవంత మైన భాగస్వామి తన పార్ట్‌నర్‌తో సరదాగా ఉండాలన్నారు. ఎప్పుడూ జోక్స్ వేసి నవ్వించాలన్నారు. సృజనాత్మకంగా ఉండాలని ఇతరుల్లో స్ఫూర్తినింపే ఆలోచనలు కలిగిఉండాలన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇటీవల శ్రుతి తన బాయ్‌ఫ్రెండ్‌కు బ్రేకప్ చెప్పిన విషయం తెలిసిందే. 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా' అని ఓ నెటిజన్ అడగ్గా.. దానికి శ్రుతి సమాధానమిచ్చారు. 'నాకు ఈతరహా ప్రశ్నలు నచ్చవు. కానీ, చెబుతున్నాను. ఇప్పుడు నేను సింగిలే. రిలేషన్ కోసం ఎదురుచూస్తున్నా. ప్రస్తుతానికి పనిలో మునిగి పోయాను. జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నా' అని తెలిపారు. దిల్లీకి చెందిన ప్రముఖ డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికతో శ్రుతి హాసన్ ప్రేమలో ఉన్నట్లు నాలుగేళ్ల క్రితం ప్రకటించారు. ఇటీవల ఆయనతో బ్రేకప్ విషయాన్ని ధ్రువీకరిస్తూ పోస్ట్ పెట్టారు 'ఇదొక క్రేజీ ప్రయాణం. ఇందులో నాగురించి నేను ఎన్నో విషయాలు తెలుసుకున్నా. ఇతరుల గురించీ అర్థం చేసుకున్నా' అని పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం శ్రుతి 'డకాయిట్'లో నటిస్తున్నారు. అడివిశేష్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. అలాగే రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రానున్న 'కూలీ'లోనూ నటిస్తున్నారు. అలాగే సూపర్ హిట్ చిత్రం 'సలార్'కు కొనసాగింపుగా రానున్న 'సలార్ శౌర్యంగపర్వం'లో నటించనున్నారు. త్వరలో ఇది పట్టాలెక్కనుంది.

# గేమ్‌ఛేంజర్‌లో పాట కోసం 20కోట్లు ఖర్చు

## రిచ్ లుక్‌లో ఉండేలా శంకర్ జాగ్రత్తలు



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్' దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్. 2025లో సంక్రాంతి కానుకగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే ఫిల్మ్ మేకర్స్ 'జరగండి జరగండి', 'రా మచ్చా మచ్చా' సాంగ్స్ రిలీజ్ చేసి అభిమానుల్లో హైప్ పెంచారు. నెక్స్ట్ ఓ మెలోడీ సాంగ్‌ని రిలీజ్ చేయబోతున్నారు. గ్రాండ్ విజువల్స్‌తో చిత్రీకరించిన ఈ పాటను నిర్మించటానికి నాలుగు చిన్న సినిమాలను నిర్మించే బడ్జెట్‌లో చేశారట. దీంతో అందరు నోటిపై వేలేసిన.. డైరెక్టర్ శంకర్‌కి ఇది మామూలు విషయం. ఇప్పటికే ఈ సినిమా నుండి రిలీజైన 'జరగండి జరగండి' సాంగ్ యూట్యూబ్‌లో 45 మిలియన్ వ్యూస్ కొల్లగొట్టి హిట్‌గా నిలిచింది. ఇటీవల రిలీజ్ చేసిన 'రా మచ్చా మచ్చా' లిరికల్ సాంగ్ కూడా 35 మిలియన్ వ్యూస్‌తో యూట్యూబ్ లో రచ్చ రేపింది. అయితే నవంబర్‌లో ఈ సినిమాకి సంబంధించిన నెక్స్ట్ సాంగ్ ఒక లిరికల్ మెలోడీని విడుదల చేస్తామని మూవీ మేకర్స్ ప్రకటించారు. అయితే గ్రాండ్ విజువల్స్‌తో షూట్ చేసిన ఈ పాటకి అక్షరాలా రూ. 20 కోట్లు ఖర్చయిందట. మరి 20 కోట్లు ఏంటి.. దీంతో నాలుగు చిన్న సినిమాలు నిర్మించొచ్చు. సినిమా బ్లాక్ బస్టర్ అయితే చాలు అంటున్నారు మెగా అభిమానులు.

# హనుమంతుడిగా రిషబ్ షెట్టి?

## జై హనుమాన్ మూవీపై ఊహాగానాలు



దర్శకుడు ప్రశాంత్ వర్మ పేరు 'హనుమాన్' సినిమా విజయంతో ఒక్క సారిగా మారుమోగింది. అతను తదుపరి సినిమా కూడా 'హనుమాన్' సినిమాకి సీక్వెల్‌గా 'జై హనుమాన్' తీస్తున్నట్టు ప్రకటించారు. అందులో అగ్రనటులు నటిస్తున్నారని వార్తలు బాగా వ్యాప్తి చెందిన విషయం కూడా అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికే బాలీవుడ్ అగ్ర నటుల్లో ఒకరైన రణ్‌వీర్ సింగ్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు టాక్ వినిపించింది. మరోవైపు చిరంజీవి, రామ్‌చరణ్, రానా దగ్గుబాటిలలో ఎవరైనా ఒకరు హనుమంతుడి క్యారెక్టర్ చేయనున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే అవన్నీ కేవలం పుకార్లే అని తేలింది. తాజాగా హనుమంతుడి రోల్ కోసం ఒక పాన్ ఇండియన్ స్టార్‌ని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఖరారు చేసినట్లు సమాచారం. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్'.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741